Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 320 మేడ్చల్ మల్కాజ్‌గిరి 9 డిసెంబర్ 2023 శనివారం పేజీలు : 4

### రామ్‌లల్లా విగ్రహాల తయారీ ముమ్మరం

లఖ్ నవూ: అయోధ్య రామ మందిరంలో ప్రతిష్ఠించనున్న రామ్ లల్లా విగ్రహ తయారీ ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నెలాఖరు వరకు విగ్రహాన్ని ఎంపిక చేయనున్నారు. శ్రీ రామ జన్మ భూమి తీర్థ క్షేత్రం ఏర్పాటు చేసిన బృందం బాల రూపంలో ఉన్న రాముని విగ్రహాన్ని ఎంపిక చేస్తుంది. అయోధ్యలోని ప్రధాన దేవాలయం గర్భగుడిలో ఏర్పాటు చేయనున్న రామ్ లల్లాకు చెందిన 3 విగ్రహాలను ప్రస్తుతం అయోధ్య పట్టణంలోని ప్రముఖ శిల్పులు చెక్కుతున్నారు. వీటిల్లో నుంచి ఒక విగ్రహాన్ని ఎంపిక చేయనున్నట్లు అధికారులు తెలిపారు. డిసెంబర్ 15 – 20 మధ్య మూ డు విగ్రహాలు సిద్ధమయ్యే అవకాశం ఉందని ట్రస్ట్ సభ్యులు తెలిపారు. కర్ణాటక, రాజస్థాన్ ల నుంచి తీసుకువచ్చిన రాళ్లతో రాముడి విగ్రహాలు చెక్కుతున్నారు.



# సభా సమరం

## నేటి నుంచి తెలంగాణ అసెంబ్లీ భేటీ

## ముఖ్యమంత్రి రేవంత్ సంచలనం నిర్ణయం

హైదరాబాద్: తెలంగాణలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం దూకుడుగా నిర్ణయాలు తీసుకుంటోంది.

ఈ క్రమంలో శనివారం నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి.

రెండ్రోజుల పాటు ఈ సమావే శాలు జరిపించాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం భావిస్తోంది. ప్రొటెం స్పీకర్‌గా ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఒవైసీని నియమించింది. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేల చేత ప్రొటెం స్పీకర్ ప్రమాణస్వీకారం చేయించను న్నారు. కొత్త స్పీకర్ ఎన్నికయ్యేంత వరకూ అక్బరుద్దీన్ ప్రొటెం స్పీకర్‌గా వ్యవహరించనున్నారు.

**మైనారిటీకి పెద్దపీట...** నిజానికి తెలంగాణలో ప్రొటెం స్పీకర్ ఎవరన్నదానిపై చర్చలు బాగానే జరిగాయి. సీనియారిటీ ప్రకారం మాజీ సీఎం కేసీఆర్ ప్రొటెం స్పీకర్‌గా వ్యవహరించాల్సి ఉంది. దీనిపైనా అనేక కథనాలు వచ్చాయి. ఆయన ఏకంగా.. ఎనిమిది సార్లు శాసనసభకు ఎన్నికయ్యారు. కానీ ఇంతలోనే బాత్రూంలో కాలు జారి గాయాల పాలయ్యారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. 8 వారాల పాటు విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించారు. దీంతో కేసీఆర్ ప్రతిపాదనను ప్రభుత్వం పక్కన పెట్టింది. అదేసమయంలో బీఆర్ఎస్ నుంచి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, దానం నాగేందర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఒవైసీ ఉన్నారు. ఇక కాంగ్రెస్‌లో ఆరుసార్లు ఎన్నికైన ఎమ్మెల్యేల్లో ఉత్తమ్ కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ఉన్నారు. కానీ వీరిద్దరూ మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. అయితే.. మిగిలిన వారిని ఎంపిక చేయకుండా.. మైనారిటీలకు పెద్దపీట వేయాలని నిర్ణయించిన రేవంత్ ప్రభుత్వం అనూహ్యంగా ఎంఐఎం పార్టీకి చెందిన చంద్రాయణ గుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీని ఎంపిక చేయడం గమనార్హం. ఇది ఓవైసీలకు దక్కిని తొలి అవకాశం కావడం గమనార్హం.




## ‘ప్రజాదర్బార్’ ప్రారంభం.. అర్జీలు స్వీకరించిన సీఎం రేవంత్

హైదరాబాద్: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాదర్బార్‌ను ప్రారంభించారు. శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లోని జ్యోతిబాపూలే ప్రజాభవన్ వద్దకు వచ్చిన ప్రజల నుంచి అర్జీలను ఆయన స్వీకరించారు. క్యూలైన్లలో ఉన్న ప్రజల నుంచి వినతిపత్రాలను సీఎం స్వీకరించి పరిశీలించారు.

వారి సమస్యలను రేవంత్ అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం నుంచి ప్రజాదర్బార్‌ను ప్రారంభించనున్నట్లు గురువారం తన ప్రమాణస్వీకారం అనంతరం సీఎం రేవంత్ ప్రకటించారు. దీంతో నేడు పెద్ద సంఖ్యలో ప్రజలు అక్కడికి చేరుకున్నారు. ప్రజాభవన్ వద్ద ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌లో ప్రజల అర్జీల వివరాలను అధికారులు నమోదు చేసుకున్నారు. ఆ తర్వాత క్యూలైన్లలో వారిని లోపలికి పంపారు.



## తెలంగాణలో మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం నేటి నుంచే

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. డిసెంబర్ 9వ తేదీ మధ్యాహ్నం 1.30 గంటల నుంచి రాష్ట్రంలో బాలికలు, మహిళలు, ట్రాన్స్ జెండర్లు టీఎస్‌ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని తెలిపింది. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో మహాలక్ష్మి పథకం ఒకటిగా ఉన్న విషయం తెలిసిదే. జీవో నెంబర్ 47 ద్వారా మహాలక్ష్మి పథక విధి విధానాలను ప్రభుత్వం వెల్లడించింది. కాగా, మహాలక్ష్మి పథకం కింద పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. మహిళా ప్రయాణికుల ఛార్జీ మొత్తాన్ని ఆర్టీసీకి రాష్ట్ర ప్రభుత్వం చెల్లించనుంది. ఈ పథకంకు సంబంధించిన వివరాలను టీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర పరిధిలోనే మహిళలకు ఉచిత ప్రయాణం ఉంటుందని సజ్జనార్ స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడ్నుంచి ఎక్కడికైనా ఆర్డీనరీ, ఎక్స్ ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ఉంటుందన్నారు. జీరో టికెట్ తో మహిలలకు ఉచిత ప్రయాణం కల్పించనున్నారు. మొదటి వారంలో ఎలాంటి గుర్తింపు కార్డు లేకుండానే మహిళలు ప్రయాణించవచ్చు. ఆ తర్వాత మాత్రం మహిళలు గుర్తింపు కార్డు చూపించాల్సి ఉంటుందని సజ్జనార్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన మహిళలు, ఆడపిల్లలకు మాత్రమే ఉచిత బస్సు ప్రయాణం ఉంటుందని సజ్జనార్ తెలిపారు. హైదరాబాద్ నగరంలో మాత్రం ఆర్డీనరీ, ఎక్స్ ప్రెస్, మెట్రో బస్సుల్లో మహిళలు ఉచిత ప్రయాణం చేయవచ్చన్నారు. ప్రత్యేక బస్సులు, ప్రత్యేక టూర్ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఉండదన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ప్రజా రవాణా పెరుగతుందన్నారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం చారిత్రక నిర్ణయమన్నారు. ఆర్టీసీకి లోటును ప్రభుత్వం భర్తీ చేస్తుందని సజ్జనార్ తెలిపారు. కోవిడ్ తర్వాత దేశ వ్యాప్తంగా ప్రైవేటు వాహనాల సంఖ్య పెరిగిందని.. దీంతో ఆర్టీసీపై తీవ్ర ప్రభావం పడిందని సజ్జనార్ తెలిపారు. పెరుగుతున్న వాహనాల వల్ల రోడ్డు ప్రమాదాలు, కాలుష్యం పెరుగుతోందన్నారు. ఉచిత బస్సు ప్రయాణం పథకం వల్ల మహిళలకు రక్షణ ఉంటుందన్నారు. ట్రాఫిక్ సమస్య తగ్గుతుందని చెప్పారు. ప్రస్తుతం 7200 సర్వీసులను మహాలక్ష్మి పథకం కోసం ఉపయోగిస్తామని తెలిపారు. న రద్దీని బట్టి ఆ సంఖ్యను పెంచుతామని తెలిపారు. మహాలక్ష్మి పథకానికి సంబంధించిన మార్గదర్శకాలు విడుదల చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారని సజ్జనార్ చెప్పారు. శనివారం మధ్యాహ్నం 1.30 గంటలకు అసెంబ్లీ ప్రాంగణం నుంచి ఈ పథకం ప్రారంభిస్తామన్నారు. మహిళా మంత్రులు, సీఎస్, ఎమ్మెల్యేలు, మహిళా ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.



## ఆర్డీనరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనే...!

# పని మొదలెట్టేశారుగా...!

## జెట్ స్పీడ్‌తో సీఎం రేవంత్‌రెడ్డి కార్యకలాపాలు!

## విద్యుత్ శాఖపై మరక పడకుండా రేవంత్ వ్యూహాత్మక జాగ్రత్తలు!



హైదరాబాద్: ఆలస్యం లేదు. అధికారం చేతికి అందిన వెంటనే జెట్ స్పీడ్ తో తన పని మొదలు పెట్టేశారు రేవంత్ రెడ్డి. ఏ కరెంటు పేరు చెప్పి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గొప్పలు చెప్పుకున్నారో.. ఆ మాటల్లో నిజాలు లేకపోగా.. అన్ని అబద్ధాలే అన్న విషయాన్ని నిరూపించేందుకు పని షురూ చేశారు సీఎం రేవంత్ రెడ్డి. విద్యుత్ శాఖ మీద కేసీఆర్ ఇంతకాలం చెప్పిన గొప్పల వెనుక చేదు నిజాలు.. షాకింగ్ అంశాలతో పాటు.. భారీ అప్పును బయటకు రాకుండా మేనేజ్ చేసిన వైనంపై రేవంత్ సర్కారు సీరియస్ గా ఉంది. అలా అని తాను నేరుగా రంగంలోకి దిగకుండా.. ఏ అధికారుల చేత కేసీఆర్ పనులు చేయించారో.. అదే అధికారుల చేత గత ప్రభుత్వం చేసిన తప్పుల్ని ప్రజలకు వివరించేలా చేయనున్నారు. ఇందులో భాగంగా విద్యుత్ శాఖ గడిచిన పదేళ్లలో రూ.85 వేల కోట్ల అప్పుల్ని చేసిందన్న కఠిన వాస్తవాన్ని తాను చెప్పకుండా.. అలాంటి పరిస్థితిని తమ చేతలతో తీసుకొచ్చిన అధికారుల్ని ప్రజల ముందుకు తీసుకొచ్చి.. వారి చేతే కేసీఆర్ సర్కారు తీసుకున్న నిర్ణయాల్ని తెలియజేసే ప్రయత్నం చేస్తున్నట్లుగా చెప్పాలి. రాజకీయ వైరంతో టార్గెట్ చేశారన్న మరక తమ ప్రభుత్వం మీద పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్న రేవంత్.. అదే సమయంలో.. గత పాలకులకు చెమటలు పట్టేలా తొలి రోజునే తీసుకున్న నిర్ణయాలు ఇప్పుడు సంచలనంగా మారాయి. అంతేకాదు.. 2014 నుంచి 2023 డిసెంబరు 7 వరకు ఏ శాఖలో ఎన్ని నిధులు ఖర్చు పెట్టారు? దేనికి ఖర్చు చేశారు? వాటి ప్రయోజనాలు ప్రజలకు ఎంత మేర చేరువ అయ్యాయి? లాంటి కీలక అంశాల్ని శ్వేతపత్రం రూపంలో విడుదల చేసేందుకు కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై తెలంగాణ ప్రజలకు తెలియజేసేలా అన్ని వివరాల్ని తెలియజేసేందుకు సిద్ధమైంది.

ఇందులో భాగంగా అన్ని శాఖలు తమకు వివరాలు అందజేయాలని ముఖ్యమంత్రి రేవంత్ ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగా తొలి బాణం.. కీలకమైన విద్యుత్ శాఖ మీద సంధించారు. విద్యుత్ విషయంలో తమ సర్కారు అద్భుత విజయాల్ని సాధించిందని చెప్పే కేసీఆర్ మాటల్లో నిజం ఎంతన్న విషయం ప్రజలకు అర్థమయ్యేలా చేయాలని భావిస్తున్నారు. ఎందుకంటే.. రాష్ట్రంలో నిరంతర విద్యుత్ సరఫరా కోసం కొన్ని సందర్భాల్లో యూనిట్ రూ.32 చొప్పున కూడా కొనుగోలు చేసినట్లుగా చెబుతున్నారు. ఇందులో నిజం ఎంత ఉంది? అంత భారీ ధరకు ఎవరి వద్ద కొనుగోలు చేశారు? దాని వెనుక ఉన్న లెక్కలేంటి? లాంటి అంశాలతో పాటు పదేళ్ల వ్యవధిలో రూ.86వేల కోట్ల భారీ అప్పు తెలంగాణ విద్యుత్ శాఖ మెడకు చుట్టుకుందన్న విషయాన్ని ఆ శాఖకు చెందిన కీలక అధికారుల చేతే ప్రజలకు వివరించేలా చేయటవే రేవంత్ లక్ష్యమన్నట్లుగా చెబుతున్నారు. ఈ వేగం చూస్తే.. కొద్ది రోజుల్లోనే మరిన్ని సంచలనాల దిశగా పరుగులు తీస్తుందని చెప్పాలి.

# సంపాదకీయం

## అందరు కాంగ్రెస్ మీద పడేటోళ్లే.. బీజేపీని ఒక్క మాట అనరేం?

తెలంగాణతో పాటు మరో నాలుగు రాష్ట్రాలకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఆదివారం వెలువడ్డాయి. మిగిలిన నాలుగు రాష్ట్రాలతో పోలిస్తే తెలుగుప్రజలకు మాత్రం తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాల మీదనే ఆసక్తి ఎక్కువ. జాతీయస్థాయిలో చూస్తే.. మిగిలిన నాలుగింటిలో మధ్యప్రదేశ్.. రాజస్థాన్ మీద ఆసక్తి ఎక్కువగా కనిపిస్తుంది. ఛత్తీస్ గఢ్ పైనా కొంత ఆసక్తి ఉంటుంది కానీ.. మిజోరం మీద పెద్ద ఫోకస్ పడే పరిస్థితి లేదు. బీజేపీ.. కాంగ్రెస్ కు ధీటుగా జాతీయ పార్టీ పెడుతున్నట్లుగా డాబు ప్రకటన చేసి.. తనకు తెలంగాణలో తిరుగే లేదన్నట్లుగా వ్యవహరించిన కేసీఆర్ పార్టీ తెలంగాణలో ఘోరంగా ఓడిపోవటం దేశ వ్యాప్తంగా సంచలనంగా మారింది. అదే సమయంలో.. అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో పవర్ పోగొట్టుకున్న కాంగ్రెస్.. తెలంగాణలో మాత్రం గెలుపొందటంతో ఆ పార్టీకి పరువు దక్కినట్లైంది. ఇదంతా ఒక ఎత్తు అయితే.. ఎన్నికల ఫలితాలు వెలువడిన ఐదు రాష్ట్రాల్లో కొత్త ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేస్తున్న మొదటి రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. సాధారణంగా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత కొత్త ప్రభుత్వాధినేతను ఎంపిక చేసే విషయంలో కాంగ్రెస్ పార్టీ అసాధారణ జాప్యం చేయటం.. ఎందుకు అధికారాన్ని కట్టబెట్టామా? అన్నట్లుగా ప్రజలు అనుకునే వరకు తెచ్చుకుంటారు. ఈ అపప్రదకు భిన్నంగా తెలంగాణ ఎపిసోడ్ లో కాంగ్రెస్ పార్టీ వ్యవహరించిందనే చెప్పాలి. ఎన్నికల ఫలితాలు వెలువడిన 48 గంటల వ్యవధిలోనే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎవరన్న అంశంపై అధికార ప్రకటన ఇచ్చేసింది. అయినప్పటికీ.. కాంగ్రెస్ పార్టీ తన నిర్ణయాన్ని ఆలస్యంగా ప్రకటించిందన్న విమర్శ వినిపిస్తోంది. అయితే.. మూడురాష్ట్రాల్లో విజయాన్ని సాధించిన బీజేపీ ఇప్పటివరకు తన ముఖ్యమంత్రులను ప్రకటించింది లేదు. ఆ దిశగా చర్చలు జరుగుతున్నా.. ఇప్పటివరకు ముఖ్యమంత్రులు ఎవరన్న దానిపై క్లారిటీ రాని పరిస్థితి. ఈ లెక్కన చూస్తే.. కాంగ్రెస్ చాలా వేగంగా నిర్ణయాలు తీసుకుందని చెప్పాలి. అయినప్పటికీ.. కాంగ్రెస్ ను ఆడిపోసుకుంటున్న వైనమే కనిపిస్తుంది. ఇదంతా చూస్తే.. బీజేపీ ఏం చేసినా పెద్దగా విమర్శలు ఎదురుకానప్పటికీ.. కీలక నిర్ణయాల్ని వేగంగా తీసుకున్నప్పటికీ కాంగ్రెస్ వైపు వేలెత్తి చూపిస్తున్న తీరు ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## ప్రజలకు, నాయకులకు, కార్యకర్తలకు ఎప్పుడు అండగా ఉంటాను..

### మాజీ మంత్రి , ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి.




నాయకులు, కార్యకర్తలే ఏ పార్టీకైనా పట్టుకొమ్మలని మాజీ మంత్రి ప్రస్తుత ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. టిఆర్ఎస్ పార్టీ షామీర్పేట్ మండల అధ్యక్షుడు ఇల్లసాగరం సుదర్శన్ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటుండడంతో, అయినను పరామర్శించేందుకు మల్లారెడ్డి శుక్రవారం ఇంటికి వెళ్లి సుదర్శన్ ను కలిసి ఆరోగ్య స్థితిగతులను తెలుసుకున్నారు. తాను అండగా ఉంటానని ధైర్యం చెప్పారు.

దానితో పాటుగా శామీపేటర్ పేటలోని బిఆర్ఎస్ నాయకుడు వంగ వెంకట్ రెడ్డి గృహ ప్రవేశానికి హాజరయ్యారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ విలాసాగరం బాలమణి, సేవాదళం రాష్ట్ర కార్యదర్శి బిఆర్ఎస్ జిల్లా నాయకుడు మహ్మద్ అఫ్జల్ ఖాన్,మజీద్ పూర్ సర్పంచ్ సరసం మోహన్ రెడ్డి, ఉపసర్పంచ్ నర్లరమేష్ యాదవ్, రైతు సహకార సంఘం ఉపాధ్యక్షుడు ఐలయ్య యాదవ్,నాయకులు వంగ వెంకట నరసింహారెడ్డి, దండుగుల మైసయ్య, షేక్ చాంద్ పాషా, భూమి రెడ్డి, దాసరి బాబు, మేడి రవి, వార్డు సభ్యుడు సత్యనారాయణ, ఉప్పలయ్య, రవిందర్, నవీన్ ముధిరాజ్,దూడల శ్రీకాంత్ గౌడ్, డి శ్రీకాంత్ గౌడ్,భద్రి బాబు, షేక్ సాజిద్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## స్వయం ఉపాధికి సాయం




మెదక్: బీసీ చేతి, కులవృత్తుల వారికి రూ.లక్ష సాయం అందిస్తోన్న ప్రభుత్వం ఇకపై మైనార్టీలకు ఇవ్వనుంది. తొలి విడతలో పలువురికి సబ్సిడీపై రుణాలివ్వగా, అందులో పదుల సంఖ్యలో యూనిట్లు మిగిలి ఉండడంతో వారికి శత శాతం అందజేయనున్నారు. దీంతో పాటు రెండో విడతలో సాయం అందించాలని నిర్ణయించారు. నియోజకవర్గానికి 120 మందికి చొప్పున సాయం అందిస్తారు. ఏవిధంగా అందజేయాలని మార్గదర్శకాలు రానందున కొంత సమయం పట్టే అవకాశం ఉంది. రెండో విడతకు ఎలాంటి దరఖాస్తులు స్వీకరించకుండానే.. ఇది వరకు వచ్చిన అర్జీల నుంచి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నారు. ఈ అంశంపై కథనం...

**2,239 దరఖాస్తులు**

జిల్లాలో మైనార్టీల జనాభా 51,318 ఉంది. ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు లేని యువత స్వయం ఉపాధి కోసం వ్యాపారాలను నిర్వహిస్తుంటారు. వారికోసం సబ్సిడీ రుణాలు ఎంతగానో ఉపయోగపడుతాయి. గతేడాది డిసెంబర్‌లో మైనార్టీ సంక్షేమశాఖ జిల్లాకు యూనిట్లను కేటాయించింది. కేటగిరి-1లో రూ.లక్ష రుణం కోసం 78 యూనిట్లను, కేటగిరి-2లో రూ.2 లక్షల కోసం 34 యూనిట్లను మంజూరు చేశారు. కేటగిరి-1లో రూ.80 వేలు సబ్సిడీ, రూ.20 వేలు బ్యాంకు రుణం, కేటగిరి-2లో రూ.1.40 లక్షలు సబ్సిడీ, రూ.60వేలు బ్యాంకు రుణం అందజేయాలని నిర్ణయించారు. ముస్లింలు, జైనులు, సిక్కులు, బౌద్ధులు, పార్శీలు ఈ రుణాలకు అర్హులుగా అప్పట్లో తేల్చారు. సుమారు ఆరేళ్ల తర్వాత యూనిట్లు మంజూరు కావడంతో మైనార్టీలు పెద్దసంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. 2,239 దరఖాస్తులు అందాయి. 35 శాతం మహిళలకు, 5 శాతం దివ్యాంగులకు, నిరుపేదలు, ఎటువంటి ఆధారం లేని మహిళలు, ఇదివరకు కార్పోరేషన్ రుణం తీసుకోనివారిని లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని ఆదేశాలున్నాయి. తొలివిడతలో కేటగిరి-1, కేటగిరి-2 కలిపి మొత్తం 112 యూనిట్లు కాగా, ఇందులో 91 మందికి రుణాలిచ్చారు. ఎంపికైన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమై ఉంది. కానీ ఇంత వరకు ఏ ఒక్క యూనిట్ గ్రౌండింగ్ కాలేదు. గత మార్చిలో రుణాలివ్వగా, ఇప్పటి వరకు గ్రౌండింగ్ చేయకపోవడం గమనార్హం.

**పూర్తి రాయితీపై**

దళితబంధు, బీసీ చేతి, కులవృత్తులకు సాయం అందిస్తున్న ప్రభుత్వం మైనార్టీలపై దృష్టిసారించింది. అసెంబ్లీ నియోజకవర్గానికి 120 మందికి రూ.లక్ష సాయం ఇవ్వనున్నారు. జిల్లాలో మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాలు ఉండగా, 240 మందికి సాయం అందనుంది. అప్పటి వరకు తొలివిడతలో మిగిలిన 21 మందికి త్వరలో రూ.లక్ష సాయం అందిస్తారు. తొలివిడతలో కొంత రాయితీపై రుణం ఇచ్చారు. కానీ మిగిలిన వారికి శతశాతం సబ్సిడీ రానుంది. వీరికి సాయం అందించగా, రెండో విడత ప్రక్రియను మొదలుపెట్టనున్నారు.

**మార్గదర్శకాల ప్రకారం ఎంపిక - జెమ్లానాయక్, జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి**

మైనార్టీలకు తొలివిడతలో 91 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి వారి ఖాతాల్లో నగదు జమచేశాం. మిగిలిన 21 మందికి రూ.లక్ష సాయం త్వరలో ఇవ్వనున్నాం. రెండో విడతలో సైతం నియోజకవర్గానికి 120 మంది చొప్పున అవకాశం కల్పించారు. లబ్ధిదారుల ఎంపిక మార్గదర్శకాలు రాలేవు. అవి వచ్చాక ఎంపిక చేపడతాం. రెండో విడతకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఉండదు. ఇది వరకు వచ్చిన అర్జీల్లో నుంచి ఎంపిక చేస్తాం.


## సామర్థ్య పరీక్షలు జరగవు.. బస్సులు రావు

ములుగు : జిల్లాలో జులై చివరి వారంలో కురిసిన భారీ వర్షాలు, వరదలు ఏజెన్సీ ప్రాంత వాసులకు శాపంగా మారాయి. వరదలు తగ్గి సుమారు 10 రోజులు దాటినప్పటికీ ఇంకా రవాణా వ్యవస్థ మెరుగు పడలేదు. ప్రజలు తీవ్ర వ్యయ ప్రయాసలకు గురవుతున్నారు. ఈ వ్యవహారం పలు విమర్శలకు దారి తీస్తోంది. రవాణా వ్యవస్థ మెరుగు పడకపోవడంతో హనుమకొండ నుంచి ఏటూరునాగారం మార్గంలో జాతీయ రహదారిపై భారీ వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. గోవిందరావుపేట మండలం పస్రా సమీపంలో జాతీయ రహదారిపై గల గుండ్లవాగు వంతెన అధిక వర్షాలతో దెబ్బతిన్నది. అయితే దానిని తాత్కాలిక మరమ్మతులతో పునరుద్ధరించారు. కానీ చిన్న తరహా వాహనాల రాకపోకలకే పరిమితమైంది. వంతెనకు దృఢత్వ పరీక్షలు నిర్వహించే వరకు భారీ వాహనాలను అనుమతించొద్దని కలెక్టర్ ఆదేశించడంతో ఆర్టీసీ బస్సులు నడవడం లేదు. ప్రయాణికులు అష్టకష్టాలు పడుతున్నారు. ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. సామర్థ్య పరీక్షలు ఎప్పుడు నిర్వహిస్తారు, ఎప్పుడు వాహనాలను అనుమతిస్తారో అంతు చిక్కడం లేదు.

**40 కిలోమీటర్ల దూర భారం**

హనుమకొండ నుంచి ఏటూరునాగారం వరకు 110 కిలోమీటర్ల దూరం ఉంటుంది. గుండ్లవాగు వంతెన దెబ్బతిన్న కారణంగా ఏటూరునాగారం వెళ్లాలనుకునే ప్రయాణికులు 150 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. అదనంగా సుమారు 40 కిలోమీటర్ల దూరభారం పడుతోంది. హనుమకొండ నుంచి బయలు దేరిన బస్సు గోవిందరావుపేట మండలం పస్రా వరకు వెళ్తోంది. అక్కడి నుంచి పస్రా-మేడారం మార్గంలో బస్సులను డైవర్ట్ చేస్తున్నారు. పస్రా, నార్లాపూర్,





మేడారం, తాడ్వాయి మీదుగా ఏటూరునాగారం వరకు బస్సులను నడుపుతున్నారు. ఇలా ఒక గంట సమయం వృథా అవుతోంది. హనుమకొండ నుంచి ఏటూరునాగారం వరకు ఆర్టీసీ బస్సుల్లో గతంలో రూ.160 వసూలు చేసేవారు. 40 కిలోమీటర్లు అదనంగా తిరుగుతుండడంతో ప్రస్తుతం రూ.190 వసూలు చేస్తున్నారు.

**ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యం!**

గుండ్లవాగు వంతెన జాతీయ రహదారుల శాఖ పరిధిలో ఉంది. వాహనాల రాకపోకలకు సంబంధించి ఈ వంతెనకు సామర్థ్య పరీక్షలు నిర్వహించాల్సిన బాధ్యత ఆ శాఖదే. సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. సాంకేతిక నిపుణులను తీసుకొచ్చి వంతెన స్థితి గతులను పరిశీలించి నిర్ధారించాల్సి ఉంది. ఈ ప్రక్రియకు ఇంకెన్నాళ్లు పడుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ విషయంపై ఎన్‌హెచ్ ఈఈ విద్యాసాగర్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. ఈ విషయాన్ని టెస్టింగ్ ఏజెన్సీకి సిఫారసు చేశామన్నారు. వారు ఎప్పుడు వస్తారనేది స్పష్టత లేదని సమాధానం ఇచ్చారు.

## ముమ్మరంగా జ్వర సర్వే

సిరిసిల్ల : ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వీధుల్లో దోమల బెడద బాగా పెరిగింది. వీటి కారణంగా జనాలు అనారోగ్యం బారిన పడకూడదనే ఉద్దేశంతో జిల్లా యంత్రాంగం ముందుగానే స్పందించి ముమ్మరంగా ఇంటింటా జ్వర సర్వే చేయిస్తుంది. కాలానుగుణ వ్యాధుల నియంత్రణకు జ్వర సర్వే కీలకంగా భావిస్తున్నారు. దోమల కారణంగా వచ్చే డెంగీ, మలేరియా వ్యాధులను అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నారు. ఈ ప్రక్రియ వానాకాలంలో నిరంతరాయంగా చేపట్టనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లాలోని 13 మండలాలతోపాటు రెండు పురపాలక సంఘాల్లో వైద్య సిబ్బంది ఇంటింటా జ్వర సర్వే చేస్తున్నారు. 17 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో సుమారు 652 మంది సిబ్బంది సర్వేలో పాల్గొంటున్నారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు రోజుకు 20 ఇళ్ల చొప్పున సర్వే చేస్తూ మొత్తం 5.52 లక్షల జనాభాను పరిశీలించనున్నారు. జులై 24న కార్యక్రమం మొదలై ఇప్పటి వరకు 1.85 లక్షల ఇళ్లలో ఆరోగ్య వివరాలు సేకరించినట్లు చెబుతున్నారు. క్షేత్ర సందర్శనకు వెళ్లే సిబ్బంది ఆరోగ్య వివరాలు తెలుసుకోవడంతోపాటు ఇంటి ఆవరణలో పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలిస్తారు. నీటి నిల్వ ప్రదేశాల్లో లార్వాను గుర్తించి నాశనం చేస్తారు. అలాగే ప్రతి శుక్రవారం డ్రైడేను నిర్వహిస్తూ జనాలకు అవగాహన పెంపొందిస్తున్నారు. డెంగీ కేసు నమోదైన ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్నారు. లార్వాను నాశనం చేసేలా రసాయనాలు పిచికారీ చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

**864 మంది జ్వరపీడితులు...** జిల్లాలో డెంగీ కేసుల నమోదును పరిశీలిస్తే ఏటా తగ్గుతూ వస్తున్నాయి. 2021లో 127, 2022లో 50, ఈ ఏడాది ఆగస్టు 8 వరకు కేవలం నాలుగు కేసులు నమోదైనట్లు



అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అలాగే మలేరియా కేసులు సైతం తగ్గుతున్నాయి. సర్వేలో ఇప్పటి వరకు 864 మంది జ్వర పీడితులను గుర్తించినట్లు చెబుతున్నారు. లక్షణాలను బట్టి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందులు పంపిణీ చేస్తున్నారు.

**సమన్వయంతో మెరుగైన ఫలితాలు**

గృహ సందర్శనకు వెళ్లే సిబ్బందికి పంచాయతీ ఉద్యోగులు, కార్మికులు కొంత సహకరించడం లేదన్న ఆరోపణలున్నాయి. వ్యవసాయ పనులకు ఉదయాన్నే వెళ్లడంతో ఇంట్లో కుటుంబ సభ్యులు ఉండటం లేదు. దీంతో సర్వేకు వెళ్లే సిబ్బంది అందుబాటులో ఉన్నవారి వద్ద వివరాలు సేకరిస్తున్నట్లు చెబుతున్నారు. భూమిలో ఏర్పాటు చేసిన నీటి ట్యాంకులను శుభ్రం చేయడం కొంత ఇబ్బంది. ఇలాంటి విషయాల్లో పంచాయతీ ఉద్యోగుల సహకారం తప్పనిసరి. వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీశాఖ సమన్వయంతో పని చేస్తే మెరుగైన ఫలితాలు వస్తాయి. గ్రామాల్లో సరైన వైద్య సదుపాయాలు లేకపోవడంతో స్థానిక ఆర్ఎంపీ, పీఎంపీలను ఆశ్రయిస్తుంటారు. వాళ్లు ఇచ్చిన మందుగోళీలను వాడుతుంటారు. వైద్యుల సూచనలు లేకుండా కొన్ని సందర్భాల్లో తెలిసిన మందు బిల్లలను తీసుకుంటారు. వ్యాధి ముదిరే వరకు వైద్యులను సంప్రదించరు. తెలియకుండా మందు బిల్లలను వినియోగిస్తే కలిగే దుష్ఫలితాలను వివరిస్తూ అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతో...

కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశాలతో జూన్ నుంచి జ్వర సర్వే చేపడుతున్నాం. గృహ సందర్శనలు చేస్తూ లార్వాను గుర్తించి జనాలకు అవగాహన కల్పిస్తున్నాం. జ్వర పీడితుల లక్షణాల ఆధారంగా మందు బిల్లల పంపిణీ, పరీక్షలకు సిఫారసు చేస్తున్నాం డ్రైడే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నాం. కార్యక్రమంపై కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. రోజు వారి వివరాలు సేకరిస్తూ ప్రతి పది రోజులకోసారి పునరావృతం చేయాలని ఆదేశిస్తున్నారు. ఫలితంగా జిల్లాలో డెంగీ కేసుల సంఖ్య తగ్గుముఖం పట్టింది. శ్రీరాములు, జిల్లా కీటకజనిత వ్యాధుల నియంత్రణ అధికారి

## నిధులుండీ నిర్లక్ష్యం.. నీరందక దుర్భిక్షం

ధర్మారం : 'అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని' అన్నట్లుంది ఎస్సారెస్పీ డి83 బి కాలువ ఆయకట్టు రైతుల పరిస్థితి. కాలువ మరమ్మతు పనుల్లో జాప్యం కారణంగా పంటలకు నీరందడం లేదు. అవసరమైనన్ని నిధులున్నా సకాలంలో పనులు చేపట్టడం లేదు. దీంతో ధర్మారం, ఎండపల్లి, వెల్గటూరు మండలాల్లోని ఆయకట్టుకు ఎస్సారెస్పీ నీటి విడుదల ఆలస్యమవుతోంది.

ముదురుతున్న వరి నార్లు వానాకాలం వరి సాగుకు సాధారణంగా రైతులు ఆరుద్ర కార్తె చివరలో నార్లు పోస్తారు. ఈ సీజన్‌కు నార్లు పోసి నెల రోజులు దాటింది. ఇటీవలి వర్షాలకు పొలాల్లో జాలువారడం, బావుల్లోని నీటి ఆధారంగా చాలా మంది రైతులు నాట్లు వేసేందుకు పొలాలను దమ్ము చేశారు. వారం రోజులుగా మండుతున్న ఎండలతో దున్నిన పొలాలు ఎండుతున్నాయి. ఎస్సారెస్పీ ద్వారా ఈ నెల 9వ తేదీనే పంటలకు నీటిని విడుదల చేయగా, డి83 బి కాలువ మరమ్మతు పనులు పూర్తి కాకపోవడంతో వదలడం సాధ్యం కాలేదు. ధర్మారం మండలం మల్లాపూర్ శివారు నుంచి వెల్గటూరు మండలంలోని గోదావరి తీరం వరకు 28 కిలోమీటర్ల పొడవునా ఉన్న ఈ కాలువ ద్వారా ధర్మారంతో పాటు ఎండపల్లి, వెల్గటూరు మండలాల్లో 17,585 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందాల్సి ఉంది. సజావుగా సాగితే పక్షంలో పూర్తి అయిదేళ్ల కిందట ధర్మారం శివారులో అండర్ టన్నెల్(యూటీ) దెబ్బతిని ఎస్సారెస్పీ డి83 బి కాలువకు గండి పడింది. అప్పట్లో తాత్కాలికంగా మరమ్మతు చేసి నీటిని విడుదల చేశారు. యూటీ నిర్మాణానికి కొద్ది నెలల కిందట రూ.87.6 లక్షలు మంజూరయ్యాయి. నెల రోజుల కిందట పనులు ప్రారంభించారు. అయితే యూటీ నిర్మిస్తున్న ప్రదేశం పల్లంగా ఉండటం, చిత్తడి ప్రదేశం కావడంతో ఆశించిన మేర పనులు సాగడం లేదు. తాజాగా స్లాబు పనులు పూర్తయ్యాయి. స్లాబుపై మట్టి నింపి కాలువ పునరుద్ధరణ పనులు నిర్వహించాల్సి ఉంది. వర్షాలు లేకుంటే పది రోజుల్లో పనులు కొలిక్కి వస్తాయని సైట్ ఇంజినీర్లు చెబుతున్నా పక్షం రోజులు పట్టే ఆస్కారం ఉంది. అనుసంధానం.. అర్ధంతరం నందిమేడారం రిజర్వాయరు నుంచి ఎస్సారెస్పీ డి83 బి కాలువకు 12.14 కోట్ల వ్యయంతో చేపట్టిన అనుసంధాన కాలువ పనులు ఇంకా పూర్తి కాలేదు. ఈ కాలువ పూర్తయితే ధర్మారం శివారులో కాలువ 10.775 కిలోమీటర్ల నుంచి నుంచి దిగువన 28 కిలోమీటర్ల వరకు ఆయకట్టుకు నీటిని విడుదల చేసే అవకాశం ఉండేది. గత నవంబరులో పనులు ప్రారంభించిన గుత్తేదారు మట్టి పనులు పూర్తి చేశారు. వంతెనలు, పాసేజ్‌ల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. నాలుగు నెలలుగా ఇవి సాగడం లేదు.

# స్థానికతకే పట్టం

కోరుట్ల : కోరుట్ల శాసన సభ ఎన్నికల్లో భారాస వరుసగా అయిదోసారి విజయకేతనం ఎగురవేసింది. 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా కోరుట్ల నియోజకవర్గం కొత్తగా ఏర్పడింది. 2009, 2010(ఉప ఎన్నిక), 2014, 2018(తెరాస), 2023 ఎన్నికల్లో భారాస విజయం సాధించింది. ప్రతి ఎన్నికల్లోనూ భారాస, కాంగ్రెస్, భాజపాల అభ్యర్థులే ప్రధాన పోటీదారులుగా నిలబడ్డారు. ప్రస్తుతం 2023 ఎన్నికల్లో త్రిముఖ పోటీ నెలకొంది. 2018 శాసనసభ ఎన్నికల్లో భారాస 51.63 శాతం ఓట్లు సాధించి ఘన విజయం పొందగా 2023లో 39.28 ఓట్ల శాతంతోనే విజయం సాధించింది. కానీ భారాస 12.35 శాతం ఓట్లు తగ్గాయి. భాజపాకు ప్రస్తుత ఎన్నికల్లో ఓట్ల శాతం గణనీయంగా పెరిగింది. 2018లో కేవలం 9.79 శాతం ఓట్లు పొందగా 2013లో 33.67 శాతం ఓట్లు సాధించి ఏకంగా 23.88 శాతానికి పెంచుకుంది. కాంగ్రెస్ 2018లో 32.58 శాతం ఓట్లు పొందగా, ప్రస్తుత ఎన్నికల్లో 21.06 శాతానికి పరిమితమయింది.

తండ్రి అనుభవం.. ప్రజలతో మమేకం

కోరుట్ల నియోజకవర్గంలో 2009 నుంచి కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ఎమ్మెల్యేగా ఉన్నారు. 15 ఏళ్లుగా నియోజకవర్గంలో ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండటం, కుమారుడు డా.సంజయ్ విజయం సులువైంది. సంజయ్ వెన్నెముక వైద్యుడు కావడంతో మొదటి నుంచి ఇక్కడి నాయకులు, ప్రజలతో వైద్య పరంగా సంబంధాలున్నాయి.




ప్రజా సమస్యలు పరిష్కారానికి కృషి చేశారు. ముఖ్యంగా యువత, విద్యార్థులను ఆకర్షించారు. డిగ్రీ విద్యార్థులు ఉద్యోగ అవకాశాలు పొందేలా ఉచిత శిక్షణ, టీహబ్, వీహబ్ సందర్శనలు చేయించారు. ఎన్నికల ప్రచారంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తూనే తాను ఇక్కడే మల్లాపూర్ మండలం రాఘవపేటలో పుట్టానని ఓటర్లను స్థానికత వైపు దృష్టి మళ్లించారు. ఊరురా భారాస కార్యకర్తలు, నాయకులను సమన్వయం చేస్తూ స్థానికతతో విజయం సాధించారు.

ఫలించని బీసీకార్డు.. ఆదరించని రైతులు

మెట్‌పల్లి నియోజకవర్గంలో భాజపా అభ్యర్థులు నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. ప్రస్తుత 2023 ఎన్నికల్లో భాజపా తరఫున నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ నిలిచారు. తన అమ్మమ్మ ఇల్లు కోరుట్లలోనే ఉందని, తాను ఇక్కడి ప్రభుత్వ ఆసుపత్రిలోనే జన్మించానని, తాను స్థానికేతరుడనే ప్రచారాన్ని తిప్పికొట్టారు. ఎంపీ ఎన్నికల్లో నిజామాబాద్‌కు పసుపు బోర్డును తీసుకువస్తానని చెప్పి హామీని అమలు చేశారు. ప్రస్తుత ఎన్నికల్లో భాజపా గెలిస్తే ముత్యంపేట చక్కెర కర్మాగారం తెరిపిస్తానని, స్వయంగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతోనే చెప్పించి రైతులను ఆకర్షించేలా చేశారు. అర్వింద్ ఎంపీ కావడంతో నిజామాబాద్ పార్లమెంట్, ఇతర చోట్ల ప్రచారాలకు వెళ్లడంతో ఇక్కడ పూర్తిస్థాయిలో ప్రచారం నిర్వహించలేకపోయారు. ద్వితీయశ్రేణి నాయకులకు తగిన సమయం ఇవ్వడం లేదని, తమను పట్టించుకోవడం లేదనే భాజపా నాయకులే బయట ప్రచారం చేసుకున్నారు. ఎన్నికల చివరి రోజుల్లో పలువురు నాయకులు భాజపాను వీడడం, చివరికి బీసీకార్డు, రైతులు పూర్తిస్థాయిలో భాజపాకు మొగ్గుచూపినట్లు కనిపించలేదు.

కానరాని సానుభూతి.. కరుణించని ఓటర్లు

దివంగత మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్‌రావు కుమారుడు జువ్వాడి నర్సింగరావు 2014(స్వతంత్ర), 2018, 2023 ఎన్నికల్లో వరుసగా కోరుట్ల నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచారు. మూడు ఎన్నికల్లో ఓడి పోవడంతో ప్రస్తుత ఎన్నికల్లోనైనా సానుభూతి చూపిస్తారని ఆశపడ్డ ఓటర్లు కరునించలేదు. కాంగ్రెస్ పార్టీ 6 హామీల మ్యానిఫెస్టో కోరుట్ల నియోజకవర్గంలో ఓట్లు రాల్చలేదు. కాంగ్రెస్ పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులు ఎక్కువ భాగం ఇతర పార్టీలలో చేరిపోవడంతో క్షేత్రస్థాయిలో క్యాడర్ తగ్గిపోయింది. ఏడాదికాలంగా ముత్యంపేట చక్కెర ఫ్యాక్టరీని తెరిపించాలని పాదయాత్రలు, ర్యాలీలు, నిరసనలు చేపట్టారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తే 6 నెలల్లో ముత్యంపేట చక్కర కర్మాగారాన్ని తెరిపిస్తామని టీపీపీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ముఖ్యనేతలు ప్రకటించిన రైతులు వాటిని పట్టించుకోలేదు. నియోజకవర్గంలో ఎక్కడా గట్టి పోటి ఇవ్వకుండా పోయి చివరికి మూడో స్థానంతో సరిపెట్టుకుంది.

## కేసులు తగ్గుతున్నా అప్రమత్తత అవసరమే!

నల్గొండ : నల్గొండ జిల్లాలో గత కొంత కాలంగా హెచ్‌ఐవీ, ఎయిడ్స్ బాధితుల సంఖ్య తగ్గుతున్నా అప్రమత్తత అవసరమేనని వైద్యులు చెబుతున్నారు. 16 ఏళ్ల క్రితం 9 శాతం ఉన్న పాజిటివిటీ రేటు ప్రస్తుతం 0.5 శాతానికి తగ్గింది. అయినా కొన్ని ప్రాంతాల్లో యువత అవగాహన లోపం కారణంగా ఈ వ్యాధిని కొని తెచ్చుకుంటున్నారు. మహిళా బాధితుల్లో మాత్రం ఎక్కువ శాతం వివాహితులే ఉన్నట్లు సమాచారం. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి నవంబరు వరకు 46,670 మంది బాధితులకు హెచ్‌ఐవీ, ఎయిడ్స్ పరీక్షలు నిర్వహించగా 354 మందికి పాజిటివ్ ఉన్నట్లు గుర్తించారు. ప్రస్తుతం జిల్లాలో 2,441 మంది హెచ్‌ఐవీ, ఎయిడ్స్ బాధితులున్నారు. వారికి ప్రతి నెలా ప్రభుత్వం నుంచి రూ.2,016 ఆసరా పింఛను అందిస్తున్నారు.అవగాహన కల్పిస్తున్నాం..-సుధాకర్, డీపీఎం, హెచ్‌ఐవీ, ఎయిడ్స్ కంట్రోల్ జిల్లాలో తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు గుర్తించిన అధికారులు 33 గ్రామాల్లో లింక్ వర్కర్స్ పథకం ద్వారా ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నాం. దీంతో పాటు పల్లె సుద్దులు, కళాజాత ద్వారా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.టీబీ సోకిన ప్రతిఒక్కరికీ హెచ్‌ఐవీ, ఎయిడ్స్ పరీక్షలు చేస్తున్నాం. సెక్స్‌వర్కర్లు, స్వలింగ సంపర్కులు, లింగ మార్పిడి దారులను గుర్తించి ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఆర్టీసీ బస్టాండ్, ఆసుపత్రులు, ప్రధాన కూడళ్ల వద్ద కండోమ్‌లు ఏర్పాటు చేశాం.

# స్థానం 'పది'లమేనా.?



నిర్మల్ : పదో తరగతి ఫలితాల్లో గతేడాది జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుని ప్రత్యేకతను చాటుకుంది. అయితే ఈ విద్యా సంవత్సరంలో ఆ స్థానం పదిలమేనా.. అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు ఉపాధ్యాయుల బదిలీలు, మరోవైపు శాసనసభ ఎన్నికల విధులతో.. వారంతా తీరికలేకుండా ఉన్నారు. దీంతో ఆ ప్రభావం కొంతమేర చూపే అవకాశం లేకపోలేదని పలువురు పేర్కొంటున్నారు.పూర్తయ్యేనా.?ఎన్నికల విధుల్లో అత్యధిక శాతం విద్యాశాఖకు సంబంధించిన ఉపాధ్యాయులే ఉన్నారు. వివిధ దశల్లో శిక్షణలకు హాజరవడం, తమ గురుతర బాధ్యతలు నిర్వర్తించడంలో పూర్తిగా నిమగ్నమయ్యారు. బదిలీలు ఈ విద్యా సంవత్సరంలోనే జరిగాయి. ఏటా డిసెంబరు చివరి వరకు సిలబస్ పూర్తి చేసేవారు. ఇప్పటి వరకు పలుచోట్ల 75-80 శాతం పూర్తయింది. జనవరి నుంచి విషయాల వారీగా పునఃశ్చరణ తరగతులు చేపట్టే వారు. ఈ సారి మాత్రం జనవరి 10వ తేదీలోపు ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు. తరగతులు వేగవంతం చేసినా అటు విషయాలపై పట్టు సాధించకపోవడం, నెమ్మదిగా సాగితే అనుకున్న సమయానికి పూర్తి చేయలేక విద్యార్థులపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది.

మొదలైన ప్రత్యేక తరగతులు..

విద్యాసంవత్సరం ప్రారంభం నుంచే పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు ఈ ఏడాది నుంచే పిల్లల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించడం, సులభమైన పద్ధతిలో బోధన, వారిని పూర్తి స్థాయిలో సంసిద్ధులను చేసేందుకు 'లక్ష్య' కార్యక్రమాన్ని చేపట్టింది. విద్యార్థులు, ఉపాధ్యాయులకు కరదీపికలు అందజేసి వారిలో విషయ నైపుణ్యం మెరుగుపర్చేలా చర్యలు తీసుకున్నారు. ఎఫ్‌ఏ-1, 2, ఎస్‌ఏ-1 పరీక్షలు ఇప్పటికే పూర్తి చేసి అందులో వారు సాధించిన ప్రగతి ఆధారంగా.. ఏ, బీ, సీ బృందాలుగా ఏర్పాటు చేసి వెనుకబడిన వారిపై ప్రత్యేకత కనబర్చేందుకు ఉపాధ్యాయులకు దత్తత ఇచ్చారు. నిత్యం వారిని పర్యవేక్షించడంతో పాటు నైపుణ్యం పెంపునకు మార్గనిర్దేశనం చేసేలా కార్యాచరణ రూపొందించారు. దీంతోపాటు వాట్సప్ గ్రూపులు ఏర్పాటు చేసి సందేహాలుంటే సదరు ఉపాధ్యాయులు తీర్చేలా ఏర్పాట్లు చేశారు. నవంబరు 1వ తేదీ నుంచి ప్రత్యేక తరగతులు ప్రారంభించి ఉదయం 8.30 నుంచి 9.30 వరకు, సాయంత్రం 4.30 నుంచి 5.30 గంటల వరకు నిర్వహిస్తున్నారు. రోజు, వారం, పక్షం, నెల వారీగా పరీక్షలు నిర్వహిస్తున్నారు.

ప్రణాళికలు అమలు చేస్తున్నాంఎ.రవీందర్‌రెడ్డి, జిల్లా విద్యాధికారి, నిర్మల్‌పదో తరగతి ఫలితాల విషయంలో గతేడాది స్థానాన్ని పదిలపర్చుకునేలా ప్రత్యేకత కనబరుస్తున్నాం. అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తూ విద్యార్థులను పూర్తి స్థాయిలో పరీక్షలకు సన్నద్ధం చేసేలా, భయం తొలగించేలా వారిలో ఆత్మస్థైర్యం పెంపునకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే ప్రత్యేక తరగతులు ప్రారంభించాం. ఒక ప్రధానోపాధ్యాయుడు, ఏడుగురు విషయ నిపుణులతో మండలానికో ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి పిల్లల ప్రగతి, హాజరు తదితర వాటిపై పర్యవేక్షించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. శతశాతం, అత్యధిక 10 జీపీఏ సాధనే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. ఎక్కడైనా విషయ నిపుణులు తక్కువగా ఉంటే, సమీపంలోని వారికి బాధ్యతలు అప్పగించాం.

# కమలదళం.. పెరిగిన బలం



నిర్మల్ : రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేకతను ఓట్లుగా మల్చుకోవడంలో కాంగ్రెస్.. నిర్మల్, ముథోల్‌లలో విఫలం కాగా ఖానాపూర్‌లో సఫలీకృతమైంది. అయితే గత ఎన్నికలతో పోల్చితే ఈ రెండు నియోజకవర్గాల్లో కమలదళం ఓట్ల శాతం గణనీయంగా పెంచుకుంది. ఖానాపూర్‌లో కాంగ్రెస్ ఆధిక్యం కనబర్చింది. మొత్తంగా ఈ మూడింటిల్లో భారాసకు గతంతో పోల్చితే ఓట్ల శాతం తగ్గి రెండో స్థానానికి పరిమితం కావాల్సి వచ్చింది.

రెండో స్థానానికే.. భారాస ఈ ఎన్నికల్లో మూడు స్థానాల్లో భారాస రెండో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. 2014 ఎన్నికల్లో నిర్మల్‌వాసులు బీఎస్పీకి పట్టం కట్టారు. ఇక్కడ అప్పటి తెరాస రెండో స్థానానికి పరిమితమైంది. ఆ ఎన్నికల్లో తెరాసకు 32.73 ఓట్లుగా.. 2018లో ఓట్ల శాతం 46.24 పెరిగింది. ఈ సారి 28.28 శాతం ఓట్లతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

ముథోల్‌లో 2014లో తెరాస 26.73 ఓట్ల శాతంతో మూడోస్థానంలో నిలవగా.. 2018లో 43.68 శాతం ఓట్లు వచ్చాయి. అయితే ప్రస్తుతం 36.32కు పడిపోయింది.

ఖానాపూర్‌లో 2014లో.. తెరాస 49.33, 2018లో 30.51 శాతం ఓట్లు వచ్చాయి. ఈ రెండు ఎన్నికల్లో తెరాస విజయం సాధించింది. ఈ ఎన్నికల్లో 2018లో వచ్చిన ఓట్ల శాతం కంటే 0.42 శాతం ఎక్కువగా వచ్చినా ఓటమి తప్పలేదు. ఫలితంగా రెండో స్థానంతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

పుంజుకోని కాంగ్రెస్..ఖానాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ విజయం కేతనం ఎగురవేయగా.. నిర్మల్, ముథోల్‌లలో ఆ పార్టీ అంతగా ప్రభావం చూపలేకపోయింది. నిర్మల్‌లో ఆ పార్టీకి గత ఎన్నికల కంటే ఓట్ల శాతం గణనీయంగా పడిపోయింది. 2014 ఎన్నికల్లో 24.12 శాతం ఓట్లు రాగా.. 2018 ఎన్నికల్లో కొంత మెరుగైన ఓట్లు వచ్చాయి. 40.86 శాతం ఓట్లు రాబట్టింది. అయితే ఈ ఎన్నికల్లో కేవలం 14.54 శాతం మాత్రమే ఓట్లు దక్కించుకుంది. గత ఎన్నికలతో పోల్చితే 30.12 శాతం తక్కువ కావడం గమనార్హం.

ముథోల్‌లోనూ హస్తం హవా లేకుండా పోయింది. 2014 ఎన్నికల్లో 38.88 ఓట్లతో విజయం సాధించినా.. 2018 ఎన్నికల్లో 19.86 శాతం వచ్చి మూడో స్థానంతోనే సరిపెట్టుకుంది. ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి ఓట్ల శాతం మరింత తగ్గిపోయింది. కేవలం 7.71 శాతం రావడం ఆ పార్టీ శ్రేణులను కుంగదీసింది.

ఖానాపూర్‌లో కాంగ్రెస్ విజయకేతనం ఎగురవేయడం ఆ పార్టీ నాయకుల్లో సంబరం నింపింది. గతంలో కంటే ఓటింగ్ శాతం పెరుగుతూ వచ్చింది. 2014 ఎన్నికల్లో 19.08, 2018లో 30.51 శాతం రాగా.. ఈ ఎన్నికల్లో 33.39 శాతం ఓట్లు వచ్చాయి. రెండోస్థానంలో ఉన్న భారాస కంటే 2.88 శాతం ఓట్లు అధికంగా రావడం ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది.

సత్తాచాటిన భాజపా..

ఈ ఎన్నికల్లో నిర్మల్, ముథోల్‌లలో భాజపా సత్తాచాటింది. ఈ నియోజకవర్గాలు ఏర్పడినప్పటి నుంచి తొలిసారిగా నిర్మల్, ముథోల్‌లలో కాషాయ జెండా ఎగిరింది. భారాస గట్టిపోటీ ఇవ్వకపోగా, కాంగ్రెస్ ప్రభావం చూపలేకపోయింది. 2014, 2018 ఎన్నికల్లో.. నిర్మల్‌లో భాజపా కేవలం 5.14, 9.76 శాతం ఓట్లు పొందగా, ప్రస్తుతం ఏకంగా 54.03 శాతం ఓట్లు దక్కించుకున్నాయి. గత ఎన్నికల కంటే 44.27 శాతం ఓట్లు అధికంగా రావడం ఆ పార్టీ శ్రేణులనుసైతం ఆశ్చర్యపరిచింది.ముథోల్‌లో 2014, 2018 ఎన్నికల్లో.. భాజపా రెండో స్థానానికి పరిమితం కాగా.. ప్రస్తుతం తన సత్తా చాటింది. ఏకంగా 48.59 శాతం ఓట్లు రావడంతో.. గతంతో పోల్చితే 26.58 శాతం ఎక్కువ సంపాదించుకుంది.ఇప్పటివరకు ఖానాపూర్ పీఠంపై పాగా వేయని భాజపా.. ఓట్ల శాతం పెంచుకుంటూ రావడం ఆ పార్టీ నాయకులకు ఊరట కలిగిస్తోంది. 2018లో 15.63 ఉండగా.. ఈ ఎన్నికల్లో 29.35 శాతానికి పెంచుకోవడం గమనార్హం.

# సిరిసిల్లలో పాత కథ పునరావృతం

సిరిసిల్ల : ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సిరిసిల్ల నియోజకవర్గానికి ఓ ప్రత్యేకత ఉండేది. 2014 ముందు వరకు ఇక్కడ ఎమ్మెల్యేగా గెలిచిన పార్టీ.. రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ వేర్వేరుగా ఉండేవి. దీంతో అభివృద్ధిలో వెనుకబడిపోయామన్న భావన స్థానికంగా ఉండేది. 2009లో నియోజకవర్గాల పునర్విభజన తరవాత ఆ ఆనవాయితీ మారలేదు. ఆ ఎన్నికల్లో తెరాస అభ్యర్థిగా సిరిసిల్లలో కేటీఆర్ గెలుపొందగా.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వరుసగా రెండోసారి అధికారంలోకి వచ్చింది. 2014లో రాష్ట్ర ఏర్పాటు తరవాత పరిస్థితి మారింది. వరుసగా రెండుసార్లు తెరాస ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి రాగా.. కేటీఆర్ ఎమ్మెల్యేగా ఎన్నికవడంతోపాటు మంత్రిగానూ కొనసాగారు. ప్రస్తుత ఎన్నికల్లో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. సిరిసిల్ల నుంచి వరుసగా నాలుగోసారి కేటీఆర్ విజయం సాధించినా.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో పాత ఆనవాయితీ కొనసాగినట్లయింది.

అభివృద్ధి కొనసాగాలని ఆకాంక్షతెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తర్వాత రాష్ట్రంలో అప్పటి నుంచి తెరాస (ప్రస్తుతం భారాస) అధికారంలో ఉండటం, సిరిసిల్ల ఎమ్మెల్యేగా కె.తారక రామారావు కొనసాగడంతో నియోజకవర్గం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కుమారుడు కావడం, పైగా మంత్రిగా కొనసాగుతూ గడిచిన తొమ్మిదిన్నరేళ్లలో నిధులు తీసుకొచ్చి పనులు చేపట్టారు. జిల్లాగా మార్చడంతోపాటు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. రాష్ట్రంలోనే కాకుండా, దేశంలోనే గుర్తింపు వచ్చేవిధంగా విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి ఇలా అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి జాతీయ స్థాయిలో అవార్డులు అందుకునేలా కృషి చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగా కేటీఆర్ ప్రతిపక్ష స్థానంలో ఉన్నారు.

# బ్యాంకు రుణం.. లక్ష్యం వైపు అడుగులు

నిజామాబాద్ : మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ఏటా బ్యాంకు లింకేజీ రుణాలు అందిస్తారు. తీసుకున్న రుణంతో చిన్నపాటి వ్యాపారం చేస్తూ నారీమణులు కుటుంబానికి అండగా ఉంటున్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి జిల్లాకు రూ.1,032.74 కోట్ల మేర రుణ లక్ష్యం ఉంది. ఇందులో నుంచి ఇప్పటి వరకు రూ.748.18 కోట్ల రుణం అందించి 72.45 శాతం లక్ష్యం సాధించింది. ఆర్థిక ఏడాది ముగిసేందుకు మరో మూడు నెలలు ఉండటంతో శత శాతం లింకేజీ రుణం ఇచ్చేందుకు సిబ్బంది పని చేస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా 23,780 స్వయం సహాయక సంఘాలు ఉండగా ఇందులో 2,51,104 మంది సభ్యులున్నారు. ఏదైనా వ్యాపారం చేసుకునేందుకు ముందుకు వచ్చే గ్రూపులకు బ్యాంకు లింకేజీ రుణాలు అందిస్తారు. సంఘాల అర్హతను బట్టి రూ.50 వేల నుంచి రూ.5 లక్షల వరకు రుణం ఇస్తారు. తీసుకున్న రుణాన్ని సక్రమంగా చెల్లించి ఏడాదిగా పూర్తిచేస్తే మరొక్క మారు అందిస్తారు.

ఎన్నికలు ముగియడంతో..

మొన్నటి వరకు అసెంబ్లీ ఎన్నికలు ఉండటంతో సిబ్బంది ఆ విధుల్లో




బిజీగా ఉన్నారు. ప్రస్తుతం ఎన్నికలు ముగియడంతో రుణ లక్ష్యానికి పరుగులు తీస్తున్నారు. గ్రామాల్లోని ఐకేపీ సిబ్బంది వారికి ఇచ్చిన లక్ష్యం నెరవేర్చేందుకు సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు మోస్రా మండలంలో 98 శాతం అందించి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. నవీపేట 91 శాతం, డిచ్‌పల్లి, ఆర్మూర్, రుద్రూరు, ఎడపల్లి, బాల్కొండ, నిజామాబాద్, చందూరు, ముప్కాల్ 80 శాతం, జక్రాన్‌పల్లి, నందిపేట్, ఏర్గట్ల, కమ్మర్‌పల్లి, మాక్లూర్, రెంజల్ మండలాల్లో 70 శాతం రుణాలు ఇవ్వగా మిగిలిన మండలాల్లో 60 నుంచి 50 శాతం మేరకు ఇచ్చారు. వెనుకబడిన మండలాలు గట్టిగా పని చేస్తే లక్ష్యం చేరుకుంటారు.

లక్ష్యం సాధిస్తాం- చందర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, నిజామాబాద్ బ్యాంకు లింకేజీ రుణ లక్ష్యం సాధిస్తాం. ఇప్పటికే 72.45 శాతం ఇచ్చాం. ఇంకా మూడు నెలల గడువు ఉంది. ఆ లోపు వంద శాతం సాధిస్తామనే నమ్మకం ఉంది. ప్రతి మండలంలో లక్ష్యం సాధించాలని సిబ్బందిని ఆదేశించాం. సభ్యులు వ్యాపారాలు చేసుకొని ఆర్థికంగా ఎదిగి వాయిదాలు సక్రమంగా చెల్లించాలి.

సద్వినియోగం చేసుకున్నాం- మనస్విని, స్వయం సహాయక సభ్యురాలు, ముప్కాల్ బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాన్ని సద్వినియోగం చేసుకున్నాం. వచ్చిన డబ్బులతో మా గ్రామంలో పెయింటింగ్ దుకాణం ఏర్పాటు చేసుకున్నాను. దీని ద్వారా వచ్చే ఆదాయం కుటుంబ పోషణకు సరిపోతుంది. వాయిదాలు సక్రమంగా చెల్లించడంతో తిరిగి పొందుతున్నాను. ప్రతి సంఘం సభ్యురాలు వ్యాపారం ఏర్పాటు చేసుకొని రాణించాలి.

## తుది దశకు ధాన్యం కొనుగోళ్లు

కామారెడ్డి : జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు చివరి దశకు చేరుకున్నాయి. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు నుంచి ధాన్యాన్ని మిల్లులకు తరలించే వరకు అధికారులు పకడ్బందీగా వ్యవహరించారు. ఎన్నికల విధుల నుంచి పౌరసరఫరాల శాఖ అధికారులను తప్పించి పూర్తిగా ధాన్యం సేకరణ కోసమే నియమించారు. ప్రతి సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లు అధికారులకు సవాల్‌గా మారుతున్నాయి. వాహనాలు రాకపోవడం, తూకాలు ఆలస్యం కావడం, అదనంగా ధాన్యాన్ని తూకం వేస్తున్నారంటూ కర్షకులు ఆందోళనలు, ధర్నాలకు దిగిన ఘటనలున్నాయి. అయితే ఈ సీజన్‌లో కొనుగోళ్లు సాఫీగా పూర్తి కావస్తున్నాయి. ఇప్పటి వరకు 3.96 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఇందులో 83 శాతం మంది రైతులకు రూ.724.21 కోట్లు చెల్లించారు.

సవాల్‌గా తీసుకొని..

ధాన్యం కొనుగోలు, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి రావడంతో జిల్లా పాలనాధికారి జితేశ్ వి పాటిల్ కొనుగోళ్లను సవాల్‌గా తీసుకున్నారు. పైగా కామారెడ్డి నియోజకవర్గం నుంచి భారాస అధినేత కేసీఆర్ బరిలో నిలవడంతో అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టారు. ప్రభుత్వం కూడా కామారెడ్డి జిల్లాపై ప్రత్యేక శ్రద్ధ సారించింది. ధాన్యం సేకరణ, డబ్బుల చెల్లింపులు ఆలస్యమైతే రైతులు ఆందోళనకు దిగే అవకాశం ఉందని అధికారులు ముందుగానే అంచనా వేసి ఏర్పాట్లు పూర్తి చేశారు. గతంలో ధాన్యం విక్రయించిన తర్వాత 15 నుంచి 20 రోజులకు నగదు జమ చేసేవారు. ఈ సీజన్‌లో అయిదారు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో జమ చేశారు. గన్నీ సంచులు, వాహనాల కొరత లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

సన్నాలు బహిరంగ మార్కెట్‌లో..జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో 6.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. అయితే చాలా మంది కర్షకులు సన్న రకాలను బహిరంగ మార్కెట్‌లో విక్రయించారు. ముఖ్యంగా బాన్సువాడ ప్రాంతంలో నల్గొండ జిల్లాకు చెందిన వ్యాపారులు ప్రభుత్వం చెల్లిస్తున్న దానికంటే అధిక ధరకు రైతుల కల్లాల్లోకి వచ్చి పచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేశారు. దీంతో ప్రభుత్వం ఇప్పటి వరకు 3.96 లక్షల మెట్రిక్ ధాన్యం కొనుగోలు చేసింది. మరో 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

తుపాన్‌తో ఆగం..ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను మిగ్‌జాం తుపాన్ అడ్డుకుంది. రెండు రోజులుగా జిల్లాలో వర్షాలు కురుస్తుండటంతో కొనుగోళ్లు నిలిచిపోయాయి. దీంతో రైతులు ధాన్యం తడవకుండా టార్పలిన్లు కప్పి ఉంచారు. మరో రెండు రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ పేర్కొనడంతో ఆగమవుతున్నారు. ధాన్యం తడిచినా బారాబాయిల్డ్ మిల్లులకు తరలిస్తామని, రైతులు ఆందోళన చెందవద్దని పౌరసరఫరాల శాఖ అధికారులు భరోసా కల్పిస్తున్నారు.

# ఇక బడుల సమగ్ర సమాచారం నిక్షిప్తం!

చెన్నూరు: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల సమగ్ర సమాచారం ఇకనుంచి ఒకేచోట ఉండనుంది. 2024–25 విద్యా సంవత్సరం నుంచి యూడైస్ ప్లస్(యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్)ను పకడ్బందీగా అమలు చేయాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఈ నెలాఖరులోగా పాఠశాలలు, పిల్లలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని సేకరించేందుకు కసరత్తు మొదలు పెట్టారు. ఆన్‌లైన్‌లో వివరాల నమోదుకు మండలాలవారీగా మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులకు శిక్షణ తరగతులను చేపట్టారు. యూడైస్ ప్లస్ ద్వారా పాఠశాలలు, విద్యార్థుల సమాచారం ఒకే చోట ఉండనుంది. ఇందులో పేరుంటేనే విద్యార్థులకు అన్ని వసతులు అందుతాయి. విద్యార్థులకు ఉదయం అల్పాహారం, రాగి జావ కూడా అందిస్తుండటంతో అవినీతికి ఆస్కారం ఉండదు. యూడైస్‌లో పేరుంటేనే అల్పాహారం, మధ్యాహ్న భోజనం, ఏకరూప దుస్తులు, పుస్తకాలు అందిస్తారు. ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా ప్రతి పేరు నమోదు చేయాల్సి ఉంటుంది. డిసెంబరు నెలాఖరులోగా అన్ని వివరాలు పంపించాలని ఆదేశాలు జారీ చేశారు. అన్ని పాఠశాలల వివరాలు ఒకేచోట లభించే అవకాశం ఉండటంతో నిధులు కూడా విడుదలై అభివృద్ధి జరిగే అవకాశం ఉంది.



అదనపు సమాచారం జోడింపు

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు, గురుకులాలు, కస్తూర్బాలు, ఆదర్శ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాలు ఇదివరకే ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. దీనికి మరిన్ని వివరాలు జోడించి కొన్ని మార్పులు చేయనున్నారు. తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీరు, మౌలిక వసతుల సమాచార వివరాలను నమోదు చేస్తారు. ఈ విధానం ద్వారా అన్ని పాఠశాలల వివరాలు ఒకే చోట కనిపిస్తాయి. పాఠశాలలు మూసివేసిన, ప్రారంభించిన వెంటనే నమోదు చేయాల్సి ఉంటుంది. నిధులు విడుదల చేసేందుకు ఉపయుక్తంగా ఉంటుంది.

మూడంచెల విధానంలో పరిశీలన..

యూడైస్‌లో నమోదైన వివరాలను మూడంచెల విధానంలో పరిశీలన చేపడతారు. ఈ నెల 14లోపు ప్రధానోపాధ్యాయులు పాఠశాలల వివరాల నమోదు పూర్తిచేయాల్సి ఉంటుంది. నమోదు చేసిన వివరాలు సక్రమంగా ఉన్నాయా..? లేవా..? అనే విషయాలను స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పరిశీలించి ఎంఈవోలకు నివేదిక అందజేస్తారు. అందులో 25 శాతం పాఠశాలలను మండల విద్యాధికారులు పరిశీలన జరుపుతారు. అనంతరం జిల్లా విద్యాధికారి 10 శాతం పాఠశాలలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఉన్నతాధికారులు నివేదిక అందిస్తారు. ఇలా మూడంచెల విధానంలో పరిశీలన చేపడతారు.

పకడ్బందీగా వివరాల నమోదుకె.యాదయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి, మంచిర్యాలయూడైస్ ప్లస్‌లో పాఠశాలలు, విద్యార్థుల వివరాలు పకడ్బందీగా నమోదు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. వివరాల నమోదుపై ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇచ్చాం. ఈ విధానంతో ఒకే దగ్గర అన్ని పాఠశాలల వివరాలు ఉంటాయి. తద్వారా సులభంగా నిధులు విడుదలయ్యే అవకాశం ఉంటుంది.

# స్వీయ రక్షణ.. కరాటే శిక్షణ

నల్గొండ : ఆత్మరక్షణ కోసం బాలికలకు కరాటేలో శిక్షణ ఇప్పించేందుకు రాణీ లక్ష్మీబాయి ఆత్మరక్ష ప్రశిక్షణ్ పేరుతో స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో సన్నాహాలు చేశారు. ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా 368 పాఠశాలల్లో నవంబరు 1 నుంచి శిక్షణా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఒక్కో మండలం నుంచి 4, 5 ఉన్నత పాఠశాలలు ఎంపిక చేసి 8 నుంచి పదో తరగతి వరకు బాలికలకు వివిధ అంశాలపై తర్ఫీదు ఇస్తున్నారు. జనవరి 23 వరకు ఈ కరాటే శిక్షణ కొనసాగనుంది. సూర్యాపేట జిల్లాలో 102, భువనగిరి యాదాద్రి జిల్లాలో 99, నల్గొండ జిల్లాలో 167 జడ్పీ, కేజీబీవీ, గురుకుల పాఠశాలలను ఇందుకోసం ఎంపిక చేశారు. మూడు నెలల కాల పరిమితిలో 33 రోజులు శిక్షణ జరిగేలా చర్యలు తీసుకున్నారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉదయం, సాయత్రం వేళల్లో గంట పాటు బాలికలకు ఆత్మరక్షణ, శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యం తదితర విషయాలపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పిస్తున్నారు. మఠంపల్లి మండలంలో పెదవీడు, రఘునాథపాలెం, వరదాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలతో పాటు కేజీబీవీని ఎంపిక చేశారని పెదవీడు జడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు కీతా శ్రీనివాసరావు చెప్పారు. కరాటే శిక్షణ బాలికల్లో ఆత్మస్థైర్యాన్ని నింపుతుందని వివరించారు.

ఆత్మరక్షణకు ఉపయోగపడుతుంది–పేరం ప్రియ, పదో తరగతి

అనూహ్య పరిణామాలు ఎదురైనప్పుడు ధైర్యంగా ఎదుర్కొనేందుకు



కరాటే ఉపయోగపడుతుంది. ఒంటరి వారమన్న భయాన్ని దరి చేరనివ్వదు. ఆపద సమయాలలో నీడలా వెన్నంటి ఉంటుంది. శ్రద్ధతో సాధన చేస్తే నిర్భయంగా ఉండవచ్చు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని గొప్పగా భావిస్తున్నాం. స్వీయ రక్షణకు ఇది ఉపయుక్తంగా ఉంటుంది.

ఆపదల్లో ఆయుధంలా–ఎస్‌కే సాజిద, పదో తరగతి

కరాటే సాధన చేస్తే చేతిలో ఆయుధం ఉన్నట్లే. దాడుల నుంచి మనల్ని మనం కాపాడుకోవచ్చు. ఈ విద్యపై ఇప్పుడిప్పుడే అవగాహన పెంచుకుంటున్నాం. మా ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు ప్రోత్సాహంతో మరిన్ని మెలకువలు నేర్చుకుంటున్నాం. ప్రస్తుతం కొన్ని పాఠశాలల్లోనే శిక్షణ ఇస్తున్నారు. అందరికీ అవకాశం కల్పిస్తే బాగుంటుంది. బాలికలు ఆకతాయిల నుంచి ఆత్మరక్షణ పొందేందుకు ఉపయోగపడుతుంది.

# గిరిజన విద్యార్థులు.. పతకాల్లో ఘనులు

ఆదిలాబాద్ : గిరి పుత్రులు వరంగల్‌లో జరిగిన దక్షిణ భారతస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో సత్తా చాటారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పతకాల పంటను పండించారు. రికార్డులు నమోదు చేశారు. అంతేకాదు! తెలంగాణకు అండర్–14 ఏళ్ల విభాగం బాల, బాలికల ఓవరాల్ ఛాంపియన్‌షిప్ రావడంలోనూ కీలకపాత్ర పోషించారు. నవంబరులో కోయంబత్తూరులో జరిగిన జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సొంతం చేసుకున్నారు. వారే ఉట్నూరు, జాతర్ల, ఆసిఫాబాద్ గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థులు. వీరంతా ఐటీడీఏ ఉన్నతాధికారుల ప్రోత్సాహం, క్రీడా శిక్షకులు గుండా సునంద్, లక్ష్మీరాం, విద్యాసాగర్ పర్యవేక్షణలో రాటుదేలుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే పతకాల్లో ఈ పాఠశాలలు నిలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో దేశానికి ప్రాతినిధ్యం వహించడమే లక్ష్యంగా సాధన చేస్తున్న పతక విజేతలపై ప్రత్యేక కథనం.

దేశం తరఫున ఆడతా.. పెందూర్ సతీష్‌కుమార్

మాది నార్నూర్ మండలం వెంపల్లి గ్రామం. ఉట్నూరు ఆదర్శ గిరిజన క్రీడా పాఠశాలలో చదువుతున్నా. ఈ ఏడాది జనవరిలో బిహార్‌లో జరిగిన జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జావెలిన్ త్రో విభాగంలో పాల్గొన్నా. హనుమకొండలో జరిగిన రాష్ట్రస్థాయి జావెలిన్ త్రో పోటీల్లో అండర్–14 ఏళ్ల విభాగంలో 48.60 మీ.ల దూరం విసిరి పసిడి పతకాన్ని సాధించా. ఇటీవల వరంగల్‌లో జరిగిన దక్షిణ భారతస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో అండర్–14 కిడ్ విభాగంలో బల్లెంను 54.63 మీ.ల దూరం విసిరా. దక్షిణ భారత సరికొత్త రికార్డును నెలకొల్పా. గతంలో ఎస్.మహేశ్(తెలంగాణ) పేరిట ఉన్న రికార్డు 48.17మీ.ల దూరాన్ని బద్దలు చేశా.

జాతీయస్థాయిలో సత్తా చాటుతా..– నైని శ్రీకాంత్

మాది కుమురం భీం జిల్లా సిర్పూర్(టి) గ్రామం. జాతర్ల ఆదర్శ గిరిజన క్రీడా పాఠశాలలో చదువుతున్నాను. అసోం, పట్నాలోని పాటలీపుత్ర ప్రాంతాల్లో జరిగిన జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని జావెలిన్ త్రో క్రీడాంశంలో అయిదో స్థానంలో నిలిచా. హనుమకొండలో 2022, 2023 సంవత్సరాల్లో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అండర్–14, 16 ఏళ్ల విభాగాల్లో ఈటెను 42 మీ, 48 మీ.ల దూరం విసిరి పసిడి పతకాలు సాధించా. రెండుసార్లు ఛాంపియన్‌షిప్‌గా ఎంపికయ్యా. ఇటీవల దక్షిణ భారత స్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో జావెలిన్ త్రో (54.44మీ.ల), హెక్సాథ్లాన్ క్రీడాంశాల్లో కాంస్య పతకాలు గెలిచా.

క్రీడా కోటాలో సైన్యంలో చేరుతా..– కొడప పరశురాం

మాది ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండల కేంద్రం. ఉట్నూరు ఆదర్శ గిరిజన క్రీడా పాఠశాలలో చదువుతున్నా. ఈ సంవత్సరం కరీంనగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో తొలిసారి పాల్గొన్నా. అందులో 600 మీ.ల పరుగులో రజత పతకం సాధించా. ఇటీవల వరంగల్‌లో జరిగిన దక్షిణ భారత స్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో 600మీ.ల పరుగు పోటీల్లో రెండో స్థానంలో నిలిచి రజతం గెలిచా. క్రీడా కోటా కింద భారత సైన్యంలో చేరుతా.

రికార్డు సృష్టిస్తా..:– ఎం.సాక్షి

మాది కుమురంభీం జిల్లా వాంకిడి మండలం కౌపగూడ గ్రామం. ఆసిఫాబాద్ ఆదర్శ గిరిజన క్రీడా పాఠశాలలో చదువుతున్నాను. 2019లో మంచిర్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అండర్–14 ఏళ్ల విభాగం లాంగ్‌జంప్‌లో రజత పతకం గెలిచా. 2022లో హనుమకొండలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్–14 ఏళ్ల విభాగంలో ఈటెను 19 మీ.ల దూరం విసిరి పసిడి పతకం సాధించా. ఇక్కడే జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో బల్లెంను 29 మీ.ల దూరం విసిరి మళ్లీ బంగారు పతకం గెలిచా. తాజాగా బాలికల అండర్–14 ఏళ్ల విభాగంలో జావెలిన్‌ను 37.82మీ.ల దూరం విసిరి దక్షిణ భారత స్థాయి రికార్డును నమోదు చేశా. గతంలో రయిజాబేగం(లక్షద్వీప్) నెలకొల్పిన 27.02 మీ.ల రికార్డు బద్దలైంది. తమినళనాడులోని కోయంబత్తూరులో జరిగిన జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జావెలిన్‌త్రో విభాగంలో ఏడో స్థానంలో నిలిచా.

పాల్గొన్న తొలిసారే పతకం..– యెర్మ లింగు

మాది ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండల కేంద్రం. జాతర్ల ఆదర్శ గిరిజన క్రీడా పాఠశాలలో చదువుతున్నాను. తొలిసారి రాష్ట్రస్థాయి జావెలిన్‌త్రో పోటీలకు ఎంపికయ్యా. అందులో రజత పతకం సాధించా. జాతీయస్థాయిలో పసిడి పతకం సాధించాలని మైదానంలో తీవ్రంగా శ్రమించా. ఇటీవల వరంగల్‌లో జరిగిన దక్షిణ భారత స్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో బల్లెంను 52.81మీ.ల దూరం విసిరి రజత పతకం గెలిచా. పోటీల్లో పాల్గొన్న తొలిసారే పతకం రావడం మరింత బాధ్యతను పెంచింది.

పసిడి పతకమే లక్ష్యం..– మడావి సోము

మాది కుమురంభీం జిల్లా వాంకిడి గ్రామం. జాతర్ల ఆదర్శ గిరిజన క్రీడా పాఠశాలలో చదువుతున్నాను. గతేడాది మెదక్‌లో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో లాంగ్ జంప్‌లో 5.40మీ.ల దూరంగా దూకి రజత పతకం గెలిచా. హనుమకొండలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో హైజంప్ విభాగంలో 1.55 మీ.ల ఎత్తు ఎగిరి పసిడి పతకం సాధించా. ఈసారి వరంగల్‌లో జరిగిన దక్షిణ భారతస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో హైజంప్(1.62మీ.), లాంగ్‌జంప్(5.90మీ.) క్రీడాంశాల్లో రజత పతకాలు కైవసం చేసుకున్నా. నవంబరులో తమిళనాడులోని కోయంబత్తూరులో జరిగిన జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అండర్–14 ఏళ్ల విభాగం లాంగ్ జంప్‌లో(5.98మీ.లు) రజత పతకం కైవసం చేసుకున్నా. రాబోయే అథ్లెటిక్స్ పోటీల్లో పసిడి పతకమే లక్ష్యంగా పెట్టుకున్నా.

# తుపాను ప్రభావం.. అన్నదాతల్లో కలవరం



రెబ్బెన : మిగ్‌జాం తుపాను ప్రభావంతో జిల్లాలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. కొన్నిచోట్ల చిరుజల్లులు కూడా పడ్డాయి. పంటలు చేతికి వచ్చే సమయం కావడంతో రైతులు కలవరపడుతున్నారు. మరోవైపు జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడంతో కోతలు పూర్తయిన రైతులు ధాన్యం కాపాడుకోవడానికి అష్టకష్టాలు పడుతున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంట అకాల వర్షానికి తుడిచిపెట్టుకుపోయే పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు.

జిల్లాలో ఇప్పటికే కొన్నిచోట్ల వరికోతలు పూర్తయ్యాయి. మరికొన్ని ప్రాంతాల్లో వారం రోజుల్లో మొదలుకానున్నాయి. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు చేసేదేమీ లేక ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా వారు దోపిడీకి పాల్పడుతున్నారు.

తక్కువ ధరకే విక్రయం..

జిల్లాలో చెరువులు, బోర్లు, కుంటలు, ప్రాజెక్టు, కాలువల కింద వానాకాలం(ఖరీఫ్)లో 57,306.47 ఎకరాల్లో వరి సాగుచేశారు. పదిరోజుల క్రితం కురిసిన అకాల వర్షాలకు వరి పంట దెబ్బతింది. ఇప్పుడు మిగ్‌జాం తుపాను ప్రభావంతో మబ్బులు కమ్ముకొని వాతావరణం చల్లబడింది. కొన్ని మండలాల్లో చిరు జల్లులు పడటంతో ధాన్యం తడిసిపోయింది. వానాకాలంలో బోర్ల కింద ముందుగా సాగు చేసిన పంటల కోతలు పూర్తయ్యాయి. కాలువలు, చెరువులు, కుంటల కింద సాగు చేసిన పంటలు ఇప్పుడిప్పుడే చేతికివస్తున్నట్లు రైతులు తెలిపారు. మరికొన్ని చోట్ల కోత దశలో ఉన్న వరిపంట నేలకొరిగింది. ముందుగా కోసిన రైతులు ధాన్యం రాశులను కళ్లాల్లో, మరికొంత మంది రోడ్ల పక్కన, పెరట్లో ఆరబోశారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను తక్కువ ధరకే ప్రైవేటుగా విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు.

కొన్నిచోట్ల వరికోతలు పూర్తయి నెల గడుస్తున్నా.. ధాన్యం కొలుగోలు కేంద్రాల జాడే లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొన్నటి వరకు ఎన్నికల హడావుడిలో ఉన్న అధికారులు ఇప్పటికైనా కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై దృష్టిసారించాలని కోరుతున్నారు.

వరికోసి 15 రోజులుతోంది.. కూడె మల్లేష్, దహెగాం

వరి కోసి 15 రోజులవుతోంది. తేమశాతం వచ్చేలా ఆరబెట్టినా కొనుగోలు కేంద్రం ప్రారంభించలేదు. అకాల వర్షాలతో ఇబ్బంది పడుతున్నాం. ఇదే అదనుగా నిత్యం దళారులు రైతుల వద్దకు వస్తున్నారు. ఎప్పటిలాగే ప్రభుత్వం కేంద్రం ఏర్పాటు చేసి కొనుగోలు చేయాలి. దోపిడీకి పాల్పడుతున్న ప్రైవేటు వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి.

త్వరలో ప్రారంభిస్తాం.. తారామణి, జిల్లా పౌరసరఫరాల అధికారి

జిల్లాలో 30 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాల్సి ఉంది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, ఐకేపీ ఆధ్వర్యంలో త్వరలో కొనుగోళ్లు ప్రారంభిస్తాం. కొనుగోళ్ల విషయంలో ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి సమాచారం రాలేదు. గన్నీ సంచులు సిద్ధంగా ఉన్నాయి.

# బాలికల ఆరోగ్యంపై చిన్నచూపేల?

ఇబ్రహీంపట్నం : కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో చదువుతున్న విద్యార్థుల సంక్షేమానికి గతంలో అందజేసిన బాలిక ఆరోగ్య రక్షా పథకంలో భాగంగా హైజిన్ కిట్ల పంపిణీ అటకెక్కగా, ఆ కిట్ల స్థానంలో అందిస్తామన్న కాస్మొటిక్ ఛార్జీలు సైతం విడుదల కావడం లేదు. దీంతో విద్యార్థులు వాటికోసం నెలల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

మూడు వేల మంది విద్యార్థులు..జిల్లాలో 14 కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, జూనియర్ కళాశాలలున్నాయి. ఇందులో 3,044 మంది విద్యార్థులు పాఠశాల, కళాశాల విద్యనభ్యసిస్తున్నారు. బాలికల సంరక్షణ కోసం 2018లో బాలికల ఆరోగ్య రక్ష పథకాన్ని అప్పటి ప్రభుత్వం ప్రారంభించింది. ఇందులో భాగంగా విద్యార్థుల ఆరోగ్యం కోసం హైజిన్ కిట్లను అందజేశారు. ఆ కిట్లలో కొబ్బరి నూనె, రెండు రకాల సబ్బులు, షాంపూ, పేస్ట్, బ్రష్, టంగ్ క్లీనర్, పౌడర్, దువ్వెన, రిబ్బన్లు, శానిటరి న్యాప్‌కిన్లు వంటివి ఉన్నాయి. ఒక్కో బాలికకు మూడు నెలలకు ఒక కిట్ చొప్పున ఏడాదికి నాలుగు కిట్లను అందించారు. కిట్ల స్థానంలో డబ్బులుకరోనా తర్వాత కిట్ల పంపిణీ నిలిచి పోయింది. వాటి స్థానంలో ఒక్కో విద్యార్థికి నెలకు రూ.100 చొప్పున నగదును వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందు కోసం విద్యార్థుల పేరిట ప్రత్యేకంగా తీసిన బ్యాంకు ఖాతాలను సేకరించారు. గత విద్యా సంవత్సరంతో పాటు ఈ విద్యా సంవత్సరం ప్రారంభమై 6 నెలలు గడిచినా వారికి కాస్మొటిక్ ఛార్జీలు విడుదల కాలేదు. దీంతో విద్యార్థులు సబ్బులు, కొబ్బరి నూనె, పేస్టు, సబ్బులు, శానిటరీ న్యాప్‌కిన్లను తదితరాలను కొనుగోలు చేయడానికి ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం సంబంధిత బకాయిలను విడుదల చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

# లెక్కింపు ముగిసినా.. ఐదేళ్లదాకా భద్రంగా

కొత్తగూడెం : శాసనసభ ఎన్నికల క్రతువు ముగిసింది. అయినప్పటికీ ఎన్నికల్లో అభ్యర్థుల భవితవ్యం తేల్చిన ఈవీఎంలను మాత్రం పటిష్ఠ భద్రత నడుమ స్ట్రాంగ్‌రూంలలో భద్రపరిచారు. వాటితో పాటు వీవీప్యాట్లు, పోస్టల్ బ్యాలెట్ పేపర్లు, వీవీప్యాట్లలోని స్లిప్పులు, మాక్‌పోల్ ధ్రువపత్రాలు, పీఓ డైరీ, టెండర్ బ్యాలెట్ పేపర్, తదితర ఎన్నికల సామగ్రిని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఆయా రిటర్నింగ్ అధికారులు స్ట్రాంగ్‌రూంలలో భద్రపరిచి తాళాలు వేసి సీల్ చేశారు. భద్రాద్రి జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు సంబంధించిన ఎన్నికల సామగ్రిని రామచంద్ర డిగ్రీ కళాశాలలో, ఖమ్మం జిల్లాకు చెందిన ఐదు నియోజకవర్గాల ఈవీఎంలను కొత్త కలెక్టరేట్ భవనంలోని గోదాములో భద్రపరిచారు. ఎన్నికలు ముగిసినా ఈవీఎంలను ఎందుకు భద్రపరుస్తారనే అంశంపై ప్రత్యేక కథనం.

స్ట్రాంగ్‌రూంల వద్ద పటిష్ఠ నిఘా

ఈవీఎంల భద్రతకు ఎన్నికల సంఘం అధికారులు స్ట్రాంగ్‌రూంలలో పటిష్ఠ నిఘా ఏర్పాటు చేశారు. స్ట్రాంగ్‌రూంలను నిరంతరం పర్యవేక్షించటానికి సీసీ కెమెరాలతో పాటు కేంద్ర బలగాలు మోహరించాయి. వాటిని తిరిగి ఎన్నికల సంఘానికి అప్పగించే వరకు జిల్లా ఎన్నికల అధికారి బాధ్యత వహించాల్సి ఉంటుంది. స్ట్రాంగ్‌రూంలలో నియోజకవర్గాల వారీగా ఎన్నికల సామగ్రిని భద్రపరిచారు.

45 రోజుల తర్వాత..

ఎన్నికల ఫలితాలు వెల్లడించిన తర్వాత 45 రోజుల పాటు జిల్లా



ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో ఈవీఎంలకు భద్రత కల్పిస్తారు. అనంతరం వాటిని ఎన్నికల సంఘానికి అప్పగించి గోదాములకు చేర్చుతారు. అక్కడ వాటిని ఐదేళ్లపాటు భద్రపరుస్తారు. అనంతరం ఎన్నికల సంఘం నియమించిన ఇంజినీర్లు వచ్చి వాటిలోని డేటాను తొలగించి అవసరాన్ని బట్టి దేశంలో ఎక్కడైనా ఎన్నికలు జరిగితే అక్కడికి తీసుకెళ్లి ఉపయోగిస్తారు.

హెూరాహెూరీగా తలపడినప్పుడు

అభ్యర్థుల మధ్య ఎన్నిక పోటాపోటీగా జరిగినప్పుడు గోదాముల్లో భద్రపరిచిన ఈవీఎంల కంట్రోల్ యూనిట్లు కీలకమవుతాయి. అతి తక్కువ ఓట్లతో ఓడిపోయిన అభ్యర్థులు ఎప్పుడైనా ఓట్లను మళ్లీ లెక్కించాలని న్యాయస్థానాలకు వెళ్లవచ్చు. అలాంటి సందర్భంలో ఇవి కీలకం. 2018 ఎన్నికల్లో 441 ఓట్లతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ధర్మపురి నియోజకవర్గం నుంచి కొప్పుల ఈశ్వర్ (తెరాస) దొడ్డిదారిన గెలిచారని కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్.. న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అయితే ఈసారి జరిగిన ఎన్నికల్లో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని భద్రాచలం మినహా మిగతా నియోజకవర్గాల్లో విజేతల మెజార్టీ భారీగా ఉండటంతో ఇక్కడ అలాంటి పరిస్థితులు ఉత్పన్నమయ్యే అవకాశమే లేదంటున్నారు ఎన్నికల నిర్వహణ అధికారులు.

తక్షణ పరిష్కారానికి..

ఓట్ల లెక్కింపు ముగిసిన తర్వాత గెలిచిన అభ్యర్థిపై పరాజితులు ఎప్పుడైనా ఫిర్యాదు చేసే అవకాశముంటుంది. ఓట్ల లెక్కింపు సమయంలో ఏవైనా అవకతవకలు జరిగాయని సదరు అభ్యర్థులు భావించి న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చు. ఇలాంటి సందర్భాల్లో అభ్యర్థులకు న్యాయం చేయటానికి ఈవీఎంల కంట్రోల్ యూనిట్లలో నిక్షిప్తమైన ఓట్లను మళ్లీ లెక్కించాలని న్యాయస్థానం ఆదేశించవచ్చు. అలాంటప్పుడు ఏ నియోజకవర్గంలో ఫిర్యాదు అందితే దానికి సంబంధించిన కంట్రోట్ యూనిట్లలో ఓట్లను తక్షణమే లెక్కించటానికి వీలుగా అధికారులు ఈవీఎంలను భద్రపరుస్తున్నారు.

# ఆర్టీసీకి ఓట్ల జాతర

కరీంనగర్ : తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికలు ఆర్టీసీకి కాసుల వర్షం కురిపించాయి. ఓటు హక్కు వినియోగించుకునేందుకు వివిధ నగరాలు, పట్టణాల్లో ఉంటున్న ఉమ్మడి జిల్లా ప్రజలు సొంతూళ్లకు, పట్టణాలకు తరలివచ్చారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం రెండు రోజులు సెలవులు ప్రకటించడంతో హైదరాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వ్యాపారులు, ఉద్యోగులు, విద్యార్థులు, వలస కార్మికులు, ఇతర వర్గాల వారి రాక ఆర్టీసీకి కలిసొచ్చింది. నవంబరు 29, 30 తేదీల్లో వేలాది మంది ఆర్టీసీ బస్సుల్లో తమ గ్రామాలకు వెళ్లడంతో కరీంనగర్ రీజియన్‌కు రూ.3.54 కోట్ల ఆదాయం సమకూరింది.




రూ.3.54 కోట్లకు పైగా ఆదాయం..

కరీంనగర్ రీజియన్‌లో 11 డిపోలు ఉండగా వాటి పరిధిలో 850 (అద్దె, ఆర్టీసీ) బస్సులు ఉన్నాయి. గత నెల 29, 30 తేదీల్లో ఆర్టీసీ 6.38 లక్షల కిలోమీటర్ల మేర బస్సులు నడపగా రూ.3.54 కోట్ల ఆదాయం వచ్చింది. గోదావరిఖని డిపో 98,486 కిలోమీటర్లు, కరీంనగర్–1 డిపో 81,959 కి.మీ బస్సులు తిప్పి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలవగా 35,080 కి.మీతో హుస్నాబాద్ డిపో చివరి స్థానంలో నిలిచింది. ఆదాయపరంగా గమనిస్తే జగిత్యాల డిపో రూ.54.91 లక్షలకు, కరీంనగర్–1 డిపో రూ.48.98 లక్షలతో మొదటి, రెండు స్థానాల్లో నిలవగా మెట్‌పల్లి డిపో రూ.18.05 లక్షల ఆదాయంతో చివరి స్థానంలో నిలిచింది.

ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చూశాం– ఎస్.భూపతి రెడ్డి (డిప్యూటీ ఆర్ఎం, కరీంనగర్ రీజియన్)

ఎన్నికల నేపథ్యంలో రద్దీ ఉంటుందని ముందే గ్రహించాం. అందుకు అనుగుణంగా చర్యలు తీసుకున్నాం. రద్దీని బట్టి ఆయా ప్రాంతాలకు బస్సులు తిప్పడంతోపాటు సిబ్బందిని కూడా ఎప్పటికప్పుడు అప్రమత్తం చేశాం. జేబీఎస్‌తోపాటు కరీంనగర్ బస్టాండ్‌లో మకాం వేసి పరిస్థితిని పరిశీలించాం. డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర విభాగాల సిబ్బంది సహకారంతో రెండు రోజుల్లో అధిక ఆదాయం సాధ్యమైంది.

# వారాంతపు సంత.. సమస్యల చింత

చేర్యాల: చేర్యాల పట్టణంలో అంబేడ్కర్ కూడలి వద్ద ప్రతి మంగళవారం సంత(అంగడి) నిర్వహిస్తారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న వారాంతపు సంతలో కనీస సౌకర్యాలు కరవయ్యాయి. పట్టణంలోని ఈ ప్రాంతం ప్రధాన కూడలితో పాటు బ్యాంకు, పోలీసు స్టేషన్‌లతో పాటు ముఖ్యమైన వాణిజ్య దుకాణాలున్నాయి. దీంతో నిత్యం రద్దీగా ఉంటుంది. దీనికి తోడు జనగామ నుంచి సిద్దిపేటకు వెళ్లే ప్రధాన రహదారిపైనా రైతులు, చిరువ్యాపారులు కూరగాయలు విక్రయిస్తుంటారు. జాతీయ రహదారి కావడంతో నిమిషానికి 35 నుంచి 40 వాహనాలు ఈ రోడ్డుపై వెళ్తుంటాయి. ఈ విషయాన్ని సర్వే చేసిన ఆర్అండ్‌బీ అధికారులే చెప్పారు. ఇరుకైన ఈ ప్రాంతంలో ఏర్పడే రద్దీతో ప్రతి మంగళవారం ప్రజలు, దుకాణదారులు నలిగిపోతున్నారు. రైతుబజారు నిర్మించినా పరిమిత సంఖ్యలో మడిగెలు ఉండటంతో సరిపోవడం లేదు. ప్రతి వారం రహదారిపైనే సంత కొనసాగుతోంది.

సబ్‌డివిజన్‌లోనే పెద్దది

చేర్యాల, మద్దూరు, బచ్చన్నపేట, నర్మెట మండలాల్లోనే పెద్ద అంగడి. చుట్టుపక్కల 80 గ్రామాల నుంచి రైతులు, చిరువాప్యారులు, మారువ్యాపారులు ఈ సంతలో కూరగాయలు విక్రయించి ఉపాధి పొందుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేసే ఉద్యోగులు, వసతి గృహ వార్డెన్లు, మధ్యాహ్నభోజన నిర్వాహకులు సంతకు వచ్చి కూరగాయలు కొనుగోలు చేస్తుంటారు. సంత జరిగే మంగళవారం రోజంతా రోడ్డు రద్దీగా ఉండటంతో కాలుతీసి కాలు పెట్టలేని పరిస్థితి. వాహనాలను రోడ్డు పక్కనే నిలపడం వల్ల సమస్య మరింత జఠిలమవుతోంది.



వాన పడినపుడు గోస

వాన జల్లు కురిసినపుడు విక్రయదారుల బాధలు వర్ణనాతీతం. ఆ ప్రాంతమంతా జలమయం అవుతుంది. సంత జరిగే వైపు మురుగు కాలువ లేదు. నీరు రోడ్డుపైనే నిలుస్తోంది. నీళ్లలోనే పెట్టి అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉంటోంది. సరుకు కూడా పాడవుతోంది. మిగిలిన వాటిని వినియోగదారులు ఎక్కువ ధర పెట్టి కొనాల్సి వస్తోంది.

ఆదాయమున్నాఅంగడి తైబజారు వేలం ద్వారా బల్దియాకు ఏటా రూ.లక్షల్లో ఆదాయం సమకూరుతోంది. సౌకర్యాల కల్పనలో పంచాయతీ నిర్లక్ష్యం వహించింది. ఈ ఏడాది నిర్వహించిన వేలం పాటలో రూ.4.34 లక్షల ఆదాయం చేకూరింది. కనీసం షెడ్లయినా నిర్మించలేని పరిస్థితి. ఫలితంగా ఎండలో, వానలోనూ రోడ్డుపైనే క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. రెండేళ్ల క్రితం ఈ కూడలి పూర్తిగా తారు రోడ్డు వేశారు.

రూ.3 కోట్లతో చేపట్టిన నిర్మాణం

పెరుగుతున్న జనాభాతో పాటు చేర్యాల స్థాయి పెరిగింది. మేజరు పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా ఎదిగింది. సిద్దిపేట జిల్లాలో చేరాక అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ ప్రాంత రైతులకు ఉపాధి మరింత మెరుగుపరచాలన్న దృష్టితో అధికారులు 'సమీకృత విపణి' నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరు చేశారు. అంగడి బజారులోనే కూరగాయలు, మాంసం మార్కెట్ నిర్మించేందుకు నిర్ణయించారు. దీనికోసం బల్దియా కార్యాలయ భవనాన్ని నేల కూల్చారు. పనులు ప్రారంభించి ఏడాది గడుస్తున్నా పిల్లర్ల స్థాయిలోనే పనులు ఆగిపోయాయి. త్వరలో ప్రారంభిస్తాం:– రాజేంద్రకుమార్, కమిషనర్, చేర్యాల పురపాలిక

వారాంతపు సంతలో కొనుగోలుదారులు, అమ్మకందారులకు ఇబ్బందులు ఎదురవుతోంది వాస్తవమే. సమీకృత విపణికి సంబంధించి ముందుగా తయారు చేయించిన ఆకృతిలో మార్పులు జరిగాయి. ఆమేరకు పనులు కాస్త ఆలస్యమయ్యాయి. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం. రెండు నెలల్లో నాన్‌వెజ్ విభాగం పూర్తి చేయిస్తాం.

# సైబర్ వలలో కుటుంబం

వరంగల్ : నాన్న మీరు కరెంటు బిల్లు చెల్లించలేదు గనక ఈ రాత్రే విద్యుత్తు కోత విధిస్తామంటూ నాన్నకు సందేశం వస్తుంది. అది నిజమేనని నమ్మి వాళ్లు చెప్పిన లింకు ద్వారా బిల్లు కడితే చివరకు ఆ డబ్బు సైబర్ మోసగాళు లాగేస్తారు. అమ్మ వాట్సప్ నెంబర్‌కు ఒక సందేశం వస్తుంది. మేమిచ్చిన టాస్క్‌లు పూర్తి చేస్తే మీరు ఆన్‌లైన్‌లో అదనంగా సంపాదించవచ్చని చెబుతారు. అది నమ్మి డబ్బులు పంపుతూ చివరకు ఆమె మోసపోతారు. పిల్లలు మొబైల్‌లో వీడియోగేమ్‌లు ఆడుతున్న పిల్లాడికి గేమింగ్ యాప్‌లు వల వేస్తాయి. పాయింట్లు పెరగాలంటే క్రెడిట్ కార్డు వివరాలు నమోదు చేయాలని. దీంతో బాలలు తల్లిదండ్రులకు తెలియకుండా కార్డు తీసుకొని వాళ్లు అడిగిన వివరాలు నమోదు చేయడంలో వేల రూపాయలు ఖాతాలో నుంచి మాయమవుతున్నాయి. తాత, నానమ్మలు మలివయస్సు వారిని బ్యాంకు ఖాతా బూచి చూపి నగదు లాగేస్తున్నారు. మీ కేవైసీ అప్‌డేట్ చేయకపోతే పింఛన్ రాదని ఫోన్‌కాల్ రావడంతో వారు తెలియక ఓటీపీ చెబుతూ నిలువునా మోసపోతున్నారు. ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా ఇటీవల వెలుగుచూసిన సైబర్ మోసాలు ఆందోళన కలిగిస్తున్నాయి. నేరగాళ్లు కుటుంబంలో ఎవరినీ వదలడం లేదు. అన్ని వయస్సుల వారిని మోసగించేందుకు చూస్తున్నారు. ఒక కుటుంబాన్ని ఉదాహరణగా తీసుకుని సైబర్ నేరస్థుల చేతిలో ప్రధానంగా ఎవరు ఎలా మోసపోతారో ఉదాహరణలతో వివరిస్తూ ప్రత్యేక కథనం. ఇవిగో ఉదాహరణలు..ఆశ చూపి.. హనుమకొండ జిల్లా ఆత్మకూరు ఠాణా పరిధిలో బుధవారం ఓ వివాహిత పోలీసులను ఆశ్రయించారు. గూగుల్ మ్యాప్ రివ్యూవార్ అనే పని.. ఆన్‌లైన్‌లో చేస్తే మీకు డబ్బులు వస్తాయని, తాము ఇచ్చిన టాస్క్‌లు పూర్తి చేయాలని సందేశం రావడంతో ఆమె లింకులు తెరుస్తూ టాస్కులు చేయగా కొంత డబ్బు వచ్చింది. మరిన్ని టాస్క్‌లు చేస్తే పెద్ద మొత్తంలో డబ్బులు వస్తాయని సైబర్ నేరగాళ్లు చెప్పిన విధంగా పలు దశలో రూ.1,25,000 పోగొట్టుకున్నారు. చివరకు తాను మోసపోయానని గ్రహించి ఆత్మకూరు పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేశారు.

లక్షలు మాయం

నెహ్రూసెంటర్: పెట్టుబడి పెడితే లాభం వస్తుందని నమ్మించి ఓ వ్యక్తి ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు రూ.3.85 లక్షలు కాజేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్జీవోస్ కాలనీకి చెందిన ఒక వ్యక్తికి జులై 15న తెలిగ్రామ్ అనే యాప్ ద్వారా లింక్ వచ్చింది. డబ్బులు పెట్టుబడి పెడితే మీకు లాభం వస్తుందని, చెప్పగా నమ్మి తన రెండు ఖాతాల నుంచి రూ.80 వేలు, రూ.35 వేలు, మర్నాడు మరో రూ.2,65,000 పంపించారు. తర్వాత సమాచారం రాకపోవడంతో తాను మోసపోయినట్టు గ్రహించి పోలీసులను ఆశ్రయించారు.

జనగామ జిల్లా పాలకుర్తి మండలం ఏడునూతలకు చెందిన ఓ వ్యక్తి ఆన్‌లైన్‌లో ఒక యాప్‌లో టేబుల్ బుక్ చేశారు. ప్రముఖ ఈకామర్స్ యాప్‌ను పోలిన నకిలీ యాప్‌ను సృష్టించడంతో కొనుగోలుదారుడు రూ.5500 చెల్లించి చివరకు నష్టపోయారు. పెద్దవాళ్లను నమ్మిస్తూ.. వరంగల్ మిల్స్‌కాలనీ ఠాణాలో ఇటీవల ఒక వృద్ధుడిని సైబర్ మోసగాళ్లు నమ్మించి రూ.లక్ష కొల్లగొట్టారు. డెబ్బై ఏళ్ల వృద్ధుడికి ఫోన్‌కాల్ వచ్చింది. మీ అల్లుడికి అండమాన్ నికోబార్‌కు బదిలీ చేస్తున్నామని రూ.లక్ష తమకు పంపితే దాన్ని నిలిపి వేస్తామని చెప్పడంతో వృద్ధుడు గుడ్డిగా అది నమ్మి అడిగినంత నగదు పంపి మోసపోయారు. వృద్ధులను అనేక రకాలుగా సైబర్ నేరగాళ్లు మోసగిస్తున్నారు.

# నక్కవాగులో ఇసుకాసురులు!



చేగుంట: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ప్రవాహంతో ఏర్పడిన ఇసుక మేటలను కొందరు అక్రమార్కులు కొల్లగొట్టడంతో పాటు.. వాగుల్లోని నీటిని వినియోగిస్తూ కృత్రిమంగా ఇసుక తయారు చేస్తున్నారు. ప్రకృతి సంపదను కాజేస్తున్నారు. జిల్లాలోని నక్కవాగును ఆసరాగా చేసుకుని ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక వ్యాపారం జోరుగా సాగుతున్నా.. అడ్డుకట్ట వేయడంలో అధికారులు విఫలమవుతున్నారనే ఆరోపణలున్నాయి. ఇసుక దందా చేసేవారికి రాజకీయ అండదండలు ఉండటమే కారణమనే విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో కథనం.

జిల్లా, ఇతర ప్రాంతాలకు తరలింపు

పటాన్‌చెరు మండలం, సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్, గౌడిచెర్ల, హనుమాన్‌నగర్, దాసుగడ్డతండా, కంది మండలం బ్యాతోల్, ఆరుట్ల, చిద్రుప్ప, బేగంపేట, ఎర్దనూర్, హత్నూర మండలలోని పల్పనూర్, గుండ్లమాచనూర్ గ్రామాల మీదుగా నక్కవాగు ప్రవహిస్తుంది. ఆ వాగును అనుకొని కృత్రిమ ఇసుక తయారీ జోరుగా సాగుతోంది. అసైన్డ్‌భూముల్లో తవ్విన మట్టిని ట్రాక్టర్లలో తీసుకొచ్చి.. జనరేటర్ల సాయంతో నక్కవాగులో నుంచి నీటిని తోడేస్తూ ఇసుక తయారు చేస్తున్నారు. మరికొందరు వాగువెంటే ఇసుక ఫిల్టర్లు ఏర్పాటు చేశారు. నిత్యం 30 నుంచి 40 ట్రిప్పుల లారీల ఇసుకను సంగారెడ్డి, పటాన్‌చెరు, జహీరాబాద్, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఒక్కో లారీ ఇసుకకు రూ.25వేల నుంచి రూ.30వేల ధరకు విక్రయిస్తూ.. రూ.లక్షలు అక్రమంగా ఆర్జిస్తున్నారు.

ప్రభుత్వ, అటవీ భూముల్లో తవ్వకాలు

హత్నూర మండలం మల్కాపూర్, మంగాపూర్, దౌల్తాబాద్, దౌలాపూర్, నాగుల దేవులపల్లి, గుండ్లమాచనూర్, పల్పనూర్, తదితర గ్రామాల్లో కృత్రిమ తయారీ జోరుగా సాగుతోంది. ఇందుకోసం సమీపంలోని ప్రభుత్వ, పట్టా, అటవీ భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా తవ్వకాలు చేపడుతున్నారు. సంగారెడ్డి మండలంలో ఇస్మాయిల్‌ఖాన్‌పేట, గౌడిచెర్లలో ఏడు ఇసుక తయారు కేంద్రాలు కొనసాగుతున్నాయి. ఇందుకోసం కొన్ని చోట్ల ఉచిత విద్యుత్తును సైతం వినియోగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా.. రెవెన్యూ, నీటిపారుదల, విద్యుత్తు శాఖ అధికారులు చర్యలు తీసుకోవడానికి వెనుకడుగు వేస్తున్నారు. ఇసుక తయారీపై స్థానికులు ఫిర్యాదు చేసినప్పుడు అధికారులు ఒకటి, రెండు రోజులు హడావుడి చేసి.. ఆ తర్వాత చేతులు దులుపుకొంటున్నారనే విమర్శలున్నాయి.

రహదారులు ధ్వంసం

ఇసుక తయారీ, తరలింపులో భాగంగా అక్రమార్కులు భారీ వాహనాలు వినియోగిస్తున్నారు. భారీ లోడుతో లారీలు వెళ్లడం వల్ల అంతర్గత, ప్రధాన, గ్రామీణ రహదారులు ధ్వంసమవుతున్నాయి. రూ.లక్షల వ్యయంతో వేసిన దారులు ఛిద్రంగా మారుతుండటంతో రాకపోకలకు ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా రాత్రివేళల్లో రహదారులపై ఏర్పడిన గుంతల వల్ల వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పరిశీలించి.. చర్యలు తీసుకుంటాం– రవీందర్‌రెడ్డి, ఆర్డీవో, సంగారెడ్డిసంగారెడ్డి డివిజన్‌లో ఎక్కడైనా కృత్రిమ తయారు చేస్తే చర్యలు తప్పవు. ఆయా మండలాల తహసీల్దార్లు వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించాలి. ఇసుక ఫిల్టర్లను నేలమట్టం చేయాలని ఆదేశిస్తాం. వాల్టా చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరించడం సరికాదు. ఇసుక తయారుచేస్తున్న వ్యాపారులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.

# ప్రమాదాలకు అడ్డుకట్ట



చేగుంట: జాతీయ రహదారి బైపాస్ సర్కిల్ వద్ద ఉపరితల వంతెన నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. మరో నెల రోజుల్లో వంతెన పూర్తికానుంది. తర్వాత దానిపై నుంచి రాకపోకలు ప్రారంభంకానున్నాయి. వంతెన లోపల నుంచి ఇతర వాహనాలు చేగుంటకు రావటం జరుగుతుంది. చేగుంట సమీపంలోని రెడ్డిపల్లి సర్కిల్ వద్ద 44వ జాతీయ రహదారి బైపాస్ వెళ్తుంది. ఇక్కడ కేంద్ర ప్రభుత్వం రూ.19 కోట్లతో ఉపరితల వంతెన నిర్మించేందుకు పచ్చజెండా ఊపింది. 2021లో మంజూరు చేస్తే 2022 ఫిబ్రవరిలో పనులు ప్రారంభించారు. అప్పటి నుంచి పనులు వేగంగా సాగుతున్నాయి. నిర్మాణంలో ఎలాంటి జాప్యం లేకుండా గుత్తేదారు నిర్మిస్తున్నారు.

ఎంతో మంది ప్రాణాలు కోల్పోయి..

44వ జాతీయ రహదారిని 2006లో నాలుగు వరుసలుగా నిర్మాణం చేపట్టారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఈ రహదారి విస్తరించి ఉంది. జిల్లాలో 55 కిలోమీటర్లు ఉండగా మనోహరాబాద్, తూప్రాన్, మాసాయిపేట, చేగుంట, నార్సింగి, రామాయంపేట మండలాల మీదుగా వెళ్తుంది. ప్రతి రోజు వేల వాహనాలు 24 గంటలు ప్రయాణం సాగిస్తుంటాయి. రెడ్డిపల్లి బైపాస్ సర్కిల్ వద్ద చాలా ప్రమాదాలు జరుగుతుండేవి. ఎంతో మంది ప్రాణాలను కోల్పోయారు. చేగుంట మండల ప్రజలతో పాటు హైదరాబాద్, కామారెడ్డి, నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్ జిల్లాలకు చెందిన వారు మరణించారు. ముఖ్యంగా చేగుంట మండలం రెడ్డిపల్లి, చిట్టోజీపల్లి, నార్సింగి మండలం వల్లూరు, భీంరావుపల్లి గ్రామాలకు చెందినవారు ద్విచక్రవాహనాలు, సైకిళ్లపై చేగుంటకు రాకపోకలు చేస్తున్న సమయంలో సర్కిల్ వద్ద జాతీయ రహదారిపై వాహనాలు వేగంగా వచ్చి ఢీకొనడంతో ప్రమాదాలు జరుగుతుండేవి.

2014 నుంచి ప్రయత్నం

ప్రమాదాలు జరిగే సర్కిల్ వద్ద ఉపరితల వంతెన నిర్మాణం కావాలని ప్రజల నుంచి పెద్దఎత్తున డిమాండ్ ఉంది. దీంతో 2014 నుంచి అధికారులు, పలు పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు ప్రయత్నాలు ప్రారంభించారు. ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం రెండేళ్ల క్రితం ఉపరితల వంతెన మంజూరు చేసింది. దీంతో పనులు ప్రారంభించారు. మొదట పాత రహదారిపై ఉన్న చిన్న వంతెనల నిర్మాణం చేపట్టారు. తర్వాత వంతెనకు ఇరువైపుల గోడల నిర్మాణం చేపట్టి మట్టి వేసే పనులు ప్రారంభించారు. ప్రస్తుతం మట్టి పనులు పూర్తిచేశారు. ఇప్పుడు దానిపై చిన్న కంకర వేసే పనులు చేస్తున్నారు. తర్వాత బీటీ నిర్మాణం చేపడితే పూర్తి అవుతుంది. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఆరు వరుసలుగా నిర్మాణం చేశారు. దీనివల్ల ఇక ఎలాంటి సమస్య లేకుండా వాహనాలు వెళ్లేందుకు అవకాశం ఉంది. జాతీయ రహదారిపై ఇంతకు ముందే తూప్రాన్ మండలం నాగులపల్లి చౌరస్తా వద్ద వంతెన నిర్మాణం చేపట్టి పూర్తిచేశారు. త్వరలోనే రెడ్డిపల్లి సర్కిల్ వద్ద పూర్తికానుంది. దీని తర్వాత జప్తిశివునూర్ వద్ద రూ.29 కోట్లతో నిర్మిస్తున్న ఉపరితల వంతెన నిర్మాణ పనులు వేగం అందుకోనున్నాయి. అలాగే తూప్రాన్ మండలం కరీంగూడ వద్ద కూడా వంతెన నిర్మాణ పనులు సాగుతున్నాయి. రానున్న రోజుల్లో జాతీయ రహదారిపై మరికొన్ని చోట్ల కూడా వంతెనలు మంజూరు కానున్నాయి. మంజూరై పూర్తిచేస్తే రానున్న రోజుల్లో జాతీయ రహదారి ప్రమాదాలు చాలా వరకు తగ్గిపోతాయి.

# ఇదేనా స్వచ్ఛత?

సిరిసిల్ల : ఇటీవల కురిసిన వర్షాలతో సిరిసిల్ల పట్టణంలోని సుభాష్‌నగర్‌లో అంతర్గత సీసీ రోడ్లు వరదలకు కొట్టుకుపోయాయి. దీంతో వాహనదారులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. సుభాష్‌నగర్ నుంచి గాంధీనగర్‌కు వచ్చే ప్రధాన కాల్వపై పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో కాల్వలో మురుగు నిలిచి దుర్వాసన వస్తుందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతర్గత వీధుల్లో కాల్వలు పూర్తిస్థాయిలో లేకపోవడంతో వర్షాలు వస్తే మురుగు రహదారులపై నుంచే పారుతుందని వాపోయారు. సుభాష్‌నగర్‌లోని మరో ప్రధాన కాల్వలో చెత్త పేరుకుపోయి మురుగు నెమ్మదిగా పారుతోంది. చెత్తాచెదారం కల్వర్టుపైన వేయడంతో దుర్గంధం వచ్చి వ్యాధుల బారిన పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. పారిశుద్ధ్య లోపం వల్ల ఈగలు, దోమలు వృద్ధి చెంది వ్యాధుల బారిన పడుతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. దీంతో చెత్తాచెదారం ఎక్కడికక్కడ పేరుకుపోతోందని, ఎప్పటికప్పుడు కాలువలను



శుభ్రం చేయిస్తే ఈ సమస్య ఉండదని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వార్డులో కాల్వలను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లాలని కోరుతున్నారు. అలాగే చెడిపోయిన అంతర్గత రహదారులను మరమ్మతులు చేయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# యువతరం.. సేవే పరమార్థం

వరంగల్ : దేశ భవిత యువతరం చేతుల్లోనే ఉందన్నది మేధావుల మాట. కొందరు యువకులు చదువులు, పనులు చూసుకుంటూనే సామాజిక సేవల్లో ముందుంటున్నారు. రెండేళ్ల కిందట ప్రపంచాన్ని వణికించిన కరోనా మహమ్మారి సమయంలో.. ఇటీవల గ్రేటర్ వరంగల్‌ను అతలాకుతలం చేసిన వరదల సందర్భంగా పలువురు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా.. యువతరం సేవా తత్పరతపై ప్రత్యేక కథనం..

వరదల్లో ప్రాణాలకు తెగించి..


రంగంపేటకు చెందిన యువకులు సేవా కార్యక్రమాల్లో ఆదర్శంగా నిలుస్తున్నారు. గత నెల వరంగల్ నగరాన్ని వరదలు ముంచెత్తిన సమయంలో పలువురిని కాపాడారు. జులై 28న పోటెత్తిన భద్రకాళి నాలా వరద రంగంపేటను ముంచెత్తింది. స్మార్ట్‌రోడ్డులో శుద్ధజలం ప్లాంటు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న వృద్ధ దంపతులు ఇంట్లోనే చిక్కుకుపోయారు. డీఆర్ఎఫ్ టీం వచ్చినప్పటికీ అక్కడికెళ్లేందుకు సాహసించలేదు. దీంతో యువకులు కరీమ్, యాకుబ్, నబీ అంత వరదల్లోనూ ప్రాణాలకు తెగించి తాడు సాయంతో ఆ ఇంట్లోకి చేరుకొని వృద్ధ దంపతులను కాపాడి స్థానికుల అభిమానాన్ని చూరగొన్నారు.

కరోనా బాధితులకు అండగా..

వరంగల్ రంగశాయిపేట ప్రాంతానికి చెందిన బాల్య మిత్రులు సేవా కార్యక్రమాల్లో ముందుంటున్నారు. 250 మంది రంగశాయిపేట యూత్ ఫోర్స్ (ఆర్‌వైఎఫ్) పేరుతో సంఘం ఏర్పాటు చేసుకొన్నారు. స్థానికుల సహకారంతో సేవా కార్యక్రమాలు చేపడుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. కరోనా సమయంలో అండర్ రైల్వేగేట్ ప్రాంతంలోని సుమారు 200 మంది బాధితులకు రోజూ ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలు అందించారు. అవసరం ఉన్నవారికి మందులు పంపిణీ చేశారు. నిత్యావసరాలు, రోగ నిరోధకశక్తి పెరిగేలా ఎండు ఫలాలు, పండ్లు అందజేసి వారు త్వరగా కోలుకునేలా అండగా నిలిచారు. క్రీడలు, చదువులో రాణిస్తున్న పేద విద్యార్థులకు అన్నివిధాలా చేయూతనందిస్తున్నారు. మహనీయుల జయంతి, వర్ధంతుల సందర్భంగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. వృద్ధులు, అనాథలకు అన్నదానం, పండ్ల పంపిణీ చేస్తున్నారు.

ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటూ..

ఆపదలో ఉన్నవరాని ఆదుకోవడం, ఆకలితో ఉన్నవారి కడుపు నింపడం లక్ష్యంగా వరంగల్‌లోని యువ నేతాజీ ఫౌండేషన్ సభ్యులు సేవా



కార్యక్రమాలు చేపడుతున్నారు. గిర్మాజీపేటకు చెందిన కొత్తకొండ అరుణ్‌కుమార్, పోలీసు కానిస్టేబుళ్లు కన్నెరాజు, బొట్టు కమలాకర్ తదితరులు ఈ ఫౌండేషన్ ఏర్పాటు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారికి రక్తదానం చేసి వారి ప్రాణాలు కాపాడుతున్నారు. ఇటీవల ఎంజీఎం ఆసుపత్రి, అంధుల పాఠశాల, ములుగురోడ్డులోని స్వయం కృషి అనాథ ఆశ్రమంలో అన్నదానాలు చేస్తున్నారు. కరోనా సమయంలో ఆన్‌లైన్ చదువుల సందర్భంగా పేద విద్యార్థులు 11 మందికి చరవాణులు, శివనగర్, హనుమకొండ, నెక్కొండ ప్రాంతాలకు చెందిన నలుగురికి ల్యాప్‌టాప్‌లను అందించారు. ఒక దివ్యాంగురాలికి కుట్టుమిషన్ అందించి ఉపాధి కల్పించారు. ఎంజీఎం ఆసుపత్రిలో రోగులకు తాగునీటి కోసం రెండు కూలర్లు, అక్వాగార్డు ఫిల్టర్ల యంత్రాన్ని అందించారు. సభ్యుల చందాలు, దాతల సహకారంతో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు కొత్తకొండ అరుణ్ తెలిపారు. వాట్సాప్ వేదికగా..వరంగల్ అండర్ రైల్వేగేటు ప్రాంతానికి చెందిన యువకులు 2015లో వాట్సాప్ వేదికగా చేసుకొని సామాజిక సేవా కార్యక్రమాలతో ఆదర్శంగా నిలుస్తున్నారు. ఖిలావరంగల్ మధ్యకోటకు చెందిన పేరుమాండ్ల మధు నాయకత్వంలో సుమారు 60 మంది సభ్యులు వారి జన్మదినం రోజున రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. అంధుల పాఠశాలలో అన్నదానం చేస్తూ మానవత్వాన్ని చాటుకొంటున్నారు. లేబర్ కాలనీలో రేచీకటితో బాధపడుతున్న అనాథలకు సొంత ఖర్చులతో వివాహం జరిపించారు. కోటలోని బాలిక పాఠశాలను దత్తత తీసుకొని 200మంది పిల్లల చదువులకు చేయూత అందిస్తున్నారు. జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థినులకు శిక్షణకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు వారికి బూట్లు, న్యూట్రీషన్ అందించారు. సంఘం సభ్యులు, విదేశాల్లో ఉన్న మిత్రులు సహకారంతో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు.

ఊరి కోసం ఒక్కటయ్యారు..

మండలంలోని ల్యాబర్తి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న 22 మంది గ్రామం కోసం ఒక్కటయ్యారు. 'ల్యాబర్తి మిత్రమండలి'గా ఏర్పడి పేదలకు అండగా నిలుస్తున్నారు. కరోనా సమయంలో గ్రామంలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.3 లక్షల వరకు ఆర్థికసాయం అందించారు. అదే గ్రామానికి చెందిన అన్నందాస్ శ్రీనివాస్ కరోనాతో మృతి చెందగా ఆయన కుమార్తె అక్షిత చదువు బాధ్యతను తీసుకొని వర్ధన్నపేటలోని ప్రైవేటు పాఠశాలలో ఫీజులు చెల్లిస్తూ ఆంగ్ల మాధ్యమం చదివిస్తున్నారు. గ్రామస్థుల సహకారంతో కార్యక్రమాలు చేస్తున్నట్లు శ్రీనివాస్, కరుణాకర్, రాజు, శ్రీధర్ తెలిపారు.

సాయం చేసే చేతులే మిన్న..ప్రార్థించే పెదవులకన్నా సాయం చేసే చేతులే మిన్న అన్నసూక్తితో ముందుకు సాగుతున్నారు ఆ యువత. గీసుకొండ మండలంలోని ఊకల్ హవేలీ గ్రామానికి చెందిన మొగసాని శంకర్ ఎమ్మార్సీ కార్యాలయంలో ఒప్పంద ఉద్యోగం చేస్తూ జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన 25 మంది యువకులతో నేతాజీ సర్వీస్ టీం ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. 20మందితో వాట్సప్ గ్రూపు ఏర్పాటు చేసి అవసరార్థులకు రక్తదానం చేస్తున్నారు. ములుగు జిల్లా ఏటూరు నాగారం మండలం కొండాయి, ఊరట్టం గ్రామాల్లో వరద బాధితులకు నిత్యావసరాలు అందించారు. వరంగల్‌లోని ముంపు ప్రాంతాల్లో గుడిసెలపై కప్పుకోవడానికి టార్పాలిన్‌లు పంపిణీ చేశారు. టీం సభ్యులు రక్తదానం చేయడంలో ముందుంటున్నారు. 120 సార్లు అన్నదానాలు చేశారు. ఇప్పటి వరకు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో 20 అవార్డులు వచ్చాయి. టీమ్ అధ్యక్షుడు శంకర్ కేంద్ర మంత్రి సదానందం చేతుల మీదుగా మదర్ థెరెస్సా పురస్కారం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేణుగోపాలచారి చేతుల మీదుగా స్ఫూర్తి శిఖర జాతీయ విశిష్ట సేవా పురస్కారం అందుకున్నారు.



# నా పర్యటన ఖరారైతే తప్ప జగన్‌లో కదలిక రాలేదు

అమరావతి: తుపాను ప్రభావిత ప్రాంతాల్లో తాను పర్యటనకు వెళ్తున్నానని.. అందుకే ఇప్పుడు సీఎం జగన్ హడావుడిగా బయల్దేరారని తెదేపా అధినేత చంద్రబాబు అన్నారు. తన పర్యటన ఖరారైతే తప్ప జగన్‌లో కదలిక రాలేదని వ్యాఖ్యానించారు. మిగ్‌జాం తుపాను ప్రభావిత ప్రాంతాల పర్యటనకు చంద్రబాబు బయల్దేరారు. ఉమ్మడి గుంటూరు జిల్లా తెనాలి, వేమూరు, బాపట్ల నియోజకవర్గాల్లో ఆయన పర్యటించనున్నారు. ఈ సందర్భంగా తెనాలికి వెళ్తూ మార్గమధ్యంలో ఆగారు. రేవేంద్రపాడు వద్ద రైతులను ఆయన పరామర్శించారు. ప్రభుత్వం ఇంతవరకు పంట నష్టం అంచనాకు రాలేదని చంద్రబాబు ఎదుట వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ "ప్రజల కష్టాలు ఇక మూడు నెలలే. పొలాల్లో ఉండి రైతు కష్టాలు తెలుసుకోవాల్సిన మంత్రులెక్కడ? పంట నష్టపరిహారం నేను పెంచుకుంటూ వెళ్తే.. జగన్ తగ్గించారు. కనీసం పంట బీమా ప్రీమియం కూడా చెల్లించలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. రైతులు ధైర్యంగా ఉండాలి" అని అన్నారు. అనంతరం నందివెలుగు వద్ద దెబ్బతిన్న పంటలను చంద్రబాబు పరిశీలించారు.

# తెలంగాణ ఎన్నికల ఫలితాలపై చంద్రబాబు షాకింగ్ కామెంట్స్



అమరావతి: తెలంగాణ ఎన్నికల్లో రెండు దఫాలు అధికారం చేపట్టిన బీఆర్ఎస్ పార్టీ ఓడిపోగా.. కాంగ్రెస్ పార్టీ భారీ విజయం సాధించింది. తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈ క్రమంలో తెలంగాణ ఎన్నికల ఫలితాలపై టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పరోక్ష వ్యాఖ్యలు చేశారు. ఏపీలో జగన్ ప్రభుత్వం అహంకారంతో ఉందని.. అహంకారం ఉంటే ఏమౌతుందనేది తెలంగాణలో చూశామన్నారు. మరో మూడు నెలల తర్వాత ఏపీలో తెలంగాణ పరిస్థితే అంటూ చంద్రబాబు కామెంట్స్ చేశారు.

**ఎంతో మానసికక్షోభ అనుభవించా...** శుక్రవారం తెనాలి నియోజక వర్గం నందివెలుగులో దెబ్బతిన్న పంట పొలాలను చంద్రబాబు పరిశీలించారు. పొలాల్లోకి దిగి నీట మునిగిన చేనును స్వయంగా పరిశీలించారు. తుపాను వల్ల పూర్తిగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ... మానవ తప్పిదం వల్లే రైతులు తుపాను వల్ల తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రభుత్వ తప్పిదాలు ప్రశ్నిస్తే, తనలాంటి వాళ్లని కూడా జైల్లో పెడతారన్నారు. చేయని తప్పుకు ఎంతో మానసిక క్షోభ అనుభవించానన్నారు. ముందస్తు చర్యలతో నష్ట నివారణ చర్యలకు అన్ని అవకాశాలు ఉన్నా, ప్రభుత్వం సకాలంలో స్ప%శీ%దించలేదపి మండిపడ్డారు. కౌలు రైతుల్ని చూస్తే గుండె తరుక్కుపోతోందని ఆవేదన చెందారు. ప్రభుత్వం రైతుల్ని ఆదుకోకుంటే, నష్టపోయిన ప్రతీ రైతుని 3 నెలల తర్వాత తానే ఆదుకుంటానని హామీ ఇచ్చారు. కౌలు రైతుల్ని కూడా పూర్తి స్థాయిలో న్యాయం చేసే బాధ్యత తీసుకుంటానన్నారు. కరువు వల్ల సగం మంది పంట వేయలేదన్నారు. పంట వేసిన వారంతా తుపాను వల్ల నష్టపోయారని తెలిపారు. దేశంలోనే రైతులు ఎక్కువ అప్పుల పాలైంది ఏపీలోనే అని చెప్పుకొచ్చారు. పట్టిసీమ నీరు ముందుగా వదిలి ఉంటే ఈపాటికి రైతులు పంటల్ని కాపాడుకుని ఉండేవారన్నారు. తన షెడ్యూల్ ఖరారవుతే కానీ ముఖ్యమంత్రిలో కదలిక లేదన్నారు. వరి రైతులకు ఎకరాకు రూ.50 వేలు పైనే నష్టం వాటిల్లిందన్నారు. 2011 లోనే నష్టపరిహారం కింద రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.10,000 ఇచ్చామని గుర్తుచేశారు.

ఇప్పుడు ఎకరాకు రూ.30,000 ఇస్తే గానీ రైతులకు గిట్టుబాటు కాదన్నారు. ఇప్పుడు ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం ఇవ్వకపోతే మరో మూడు నెలలు గడిస్తే టీడీపీ అధికారంలోకి రాగానే తామే రైతులకు ఇస్తామని చంద్రబాబు భరోసా ఇచ్చారు.

# టీడీఆర్ స్కామ్‌ను బయటపెట్టిన ఆనం వెంకటరమణారెడ్డి



నెల్లూరు: ఏపీలో రూ.45 వేల కోట్ల నుంచి రూ.50 వేల కోట్ల టీడీఆర్ స్కామ్‌ను తెలుగుదేశం అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి బయటపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీలో శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు ముఖ్య నగరాల్లో రూ. వేలకోట్ల వైఎస్ టీడీఆర్ స్కామ్ జరిగిందని, రూ.45వేల కోట్ల నుంచి రూ.50 వేల కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపించారు. ఒక్క తిరుపతిలోనే రూ.4వేల కోట్లకు పైగా అవినీతి జరిగిందన్నారు. భూమా కరుణాకర్ రెడ్డి, ఆయన తనయుడు భూమా అవినయ్ రెడ్డి సూత్రధారులని అన్నారు. తిరుపతిలో 18 మాస్టర్ ప్లాన్ రోడ్లను మంజూరు చేశారని, ఇందుకుగాను 2,85,406 స్క్వేర్ ఫీట్ స్థలాలని సేకరించారన్నారు. వ్యవసాయ, రెసిడెన్షియల్ విలువకంటే... కమర్షియల్ స్థలాల విలువ నాలుగు రెట్లు ఎక్కువగా ఉంటుందని, అయితే వ్యవసాయ భూములను కమర్షియల్‌గా చూపి దోచుకున్నారని ఆరోపించారు. టీడీపీ ఎన్నిసార్లు ఆర్టీఏ కింద సమాచారం కోరినా ఇవ్వలేదని, సమాచారం ఇవ్వకున్నా... తెచ్చుకోగలమని ఆనం వెంకటరమణారెడ్డి అన్నారు.

# టీడీపీ-జనసేన పార్టీలు అధికారంలోకి రావడం ఖాయం



విశాఖ: ఫిషింగ్ హార్బర్ అగ్నిప్రమాద ఘటన దురదృష్టకర మని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు తెలిపారు. అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడారు. "అధికారంలో ఉన్నా లేకపోయినా.. మత్స్యకారులను ఎప్పుడూ ఆదుకునేది టీడీపీయే. బోట్లు కాలిపోయిన వారికి లక్ష రూపాయలు, పాక్షికంగా బోట్లు కాలిపోయిన వారికి రూ.50 వేలు ఇస్తున్నాం. జీవనోపాధి కోల్పోయిన బాధితులను ఆదుకుంటున్నాం. మత్స్యకారులను అన్ని విధాలుగా ఆదుకోవడంలో వైసీపీ సర్కార్ విఫలం అయింది. టీడీపీ స్పందించిన తర్వాతే ఈ కుంభకర్ణుడు స్పందించాడు. తుపాన్ భాదితులను చంద్రబాబు పరామర్శిస్తుంటే.. జగన్ ఇప్పుడు నిద్ర లేచాడు. బాధితులను ప్రభుత్వం ఆదుకోవడంలో పూర్తిగా విఫలం అయింది. అగ్నిప్రమాదం ఘటనపై మొదట స్పందించి ఆర్థిక సహాయం చేసింది జనసేన పార్టీనే. టీడీపీ-జనసేన ఒక్కటయ్యాయి. ఈ రెండు పార్టీలను ప్రజలు ఆదరించాలి. ఎప్పుడు ఎన్నికలు జరిగినా టీడీపీ-జనసేన పార్టీలు అధికారంలోకి వస్తాయి. అప్పుడు బాధితులకు కొత్త బోట్లు కొనిస్తాం. పేరుకే కార్పొరేషన్లు.. ఒక్క లోన్ కూడా ఇవ్వలేదు. వీటివలన ఎవరికీ ఉపయోగం లేదు." అని అచ్చెన్నాయుడుచెప్పారు.



# మోదీజీతో మా నాన్న.. కంగారేస్తోంది..!

# కేంద్రమంత్రి స్మృతి ఇరానీ పోస్టు వైరల్

దిల్లీ: కేంద్రమంత్రి స్మృతి ఇరానీ సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటారు. ఆమె చేసే పోస్టుల్లో చమత్కారం కనిపిస్తుంది. తాజాగా ఆమె తండ్రి అజయ్ కుమార్ మల్హోత్రా.. ప్రధాని మోదీని మర్యాదపూర్వకంగా కలిశారు. వీరి భేటీని ఆమె పేరెంట్-టీచర్ మీటింగ్‌తో పోల్చారు. 'మన బాస్, మన తల్లిదండ్రులు ఒక దగ్గర కూర్చున్నారంటే కంగారొచ్చేస్తుంది. వారిద్దరూ కలిసి మనపై పోటీ పడి ఫిర్యాదులు చెప్పకూడదని ప్రార్థించుకోవాలి. పేరెంట్స్-టీచర్ మీటింగ్ జరుగుతోంది' అని ఇరానీ ఇన్‌స్టాలో పోస్టు పెట్టారు.


అలాగే మోదీ, ఆమె తండ్రి దిగిన చిత్రాన్ని షేర్ చేస్తూ.. బిజీ షెడ్యూల్‌లో కూడా తమకు సమయం కేటాయించినందుకు ప్రధానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రస్తుతం ఈ చిత్రాలు నెట్టింట వైరల్‌గా మారాయి. దీనిపై ప్రముఖ నిర్మాత ఏక్తా కపూర్, నటుడు సోనూసూద్‌తో పాటు పలువురు నెటిజన్లు స్పందించారు. ఆమె మంచి విద్యార్థి అని, బాగా కష్టపడతారని రాసుకొచ్చారు. టీవీ రంగం నుంచి తన కెరీర్ మొదలు పెట్టిన స్మృతి.. భాజపాలో కీలక నేతగా ఎదిగారు. కేంద్రమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.



# ఉల్లి ఎగుమతులపై నిషేధం

దిల్లీ: దేశంలో ఉల్లి ధరలు మళ్లీ మండిపోతున్నాయి. చాలా రాష్ట్రాల్లో కిలో ఉల్లి కనీస ధర రూ.50 పైనే పలుకుతోంది. దీంతో వీటి ధరల కట్టడికి కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. 2024 మార్చి 31 వరకు ఉల్లి ఎగుమతులపై నిషేధం విధించింది. ఈ మేరకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ తాజాగా నోటిఫికేషన్ విడుదల చేసింది. దేశీయంగా ఉల్లి అందుబాటులో ఉంచడంతో పాటు ధరలు అదుపు చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. శుక్రవారం (డిసెంబరు 8) నుంచే ఈ నిషేధం అమల్లోకి వస్తున్నట్లు తెలిపింది. అయితే, ఇందులో కొన్ని మినహాయింపులు కల్పించింది.

ఈ నోటిఫికేషన్‌కు ముందే ఓడల్లో లోడ్ అయిన ఉల్లిని, ఇప్పటికే కస్టమ్స్‌కు అప్పగించిన ఉల్లి లోడ్‌ను ఎగుమతి చేసుకోవచ్చని DGFT వెల్లడించింది. అయితే, ఇతర దేశాల అభ్యర్థనల మేరకు భారత ప్రభుత్వం అనుమతిస్తే.. ఆయా దేశాలకు ఉల్లి ఎగుమతులు చేసుకోవచ్చని స్పష్టం చేసింది.



# రెపోరేటు యథాతథం

ముంబయి: కీలక వడ్డీరేట్లను యథాతథంగా ఉంచుతున్నట్లు 'భారతీయ రిజర్వ్ బ్యాంక్' గవర్నర్ శక్తికాంత దాస్ శుక్రవారం వెల్లడించారు. దీంతో రెపోరేటు 6.5 శాతం వద్ద స్థిరంగా కొనసాగనుంది. కీలక రేట్లలో ఎలాంటి మార్పు చేయకపోవడం వరుసగా ఇది ఐదోసారి. బుధవారం ప్రారంభమైన ఆర్‌బీఐ ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన కమిటీ సమావేశ నిర్ణయాలను శక్తికాంత దాస్ శుక్రవారం ప్రకటించారు.

**గవర్నర్ ప్రసంగంలోని కీలకాంశాలు..** భారత ఆర్థిక వ్యవస్థ బలంగా పుంజుకుంటోంది. దేశ ఆర్థిక వ్యవస్థ పునాదులు పటిష్ఠంగా ఉన్నాయని శక్తికాంత దాస్ తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరం రిటైల్ ద్రవ్యోల్బణం 5.4 శాతంగా ఉండొచ్చని ఆర్‌బీఐ అంచనా వేసింది. 2023-24 మూడో త్రైమాసికంలో ఇది 5.6 శాతంగా, నాలుగో త్రైమాసికంలో 5.2 శాతం ఉండొచ్చని తెలిపింది. లక్షిత పరిధి అయిన నాలుగు శాతానికి ఇంకా చేరుకోవాల్సి ఉందని పేర్కొంది. 2023-24లో దేశ జీడీపీ వృద్ధిరేటు అంచనాలను 6.5 శాతం నుంచి 7 శాతానికి ఆర్‌బీఐ పెంచింది. మూడో త్రైమాసికంలో ఇది 6.5 శాతంగా, నాలుగో త్రైమాసికంలో 6 శాతంగా ఉండొచ్చని తెలిపింది. వచ్చే ఆర్థిక సంవత్సరం తొలి మూడు త్రైమాసికాల్లో వృద్ధి రేటు వరుసగా 6.7 శాతం, 6.5 శాతం, 6.4 శాతంగా ఉండే అవకాశం ఉందని పేర్కొంది. వర్ధమాన ఆర్థిక వ్యవస్థల కరెన్సీలతో పోలిస్తే రూపాయి విలువలో ఒడుదొడుకులు చాలా తక్కువగా ఉన్నాయని దాస్ తెలిపారు. 2023 డిసెంబర్ 1 నాటికి భారత విదేశీ మారక నిల్వలు 604 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు ఆర్‌బీఐ వెల్లడించింది. డిజిటల్ రుణాల్లో మరింత పారదర్శకత తెచ్చేలా రుణ ఉత్పత్తులను అందించే వెబ్ అగ్రిగేటర్ల కోసం ఆర్‌బీఐ మార్గదర్శకాలను రూపొందించనున్నట్లు శక్తికాంత దాస్ తెలిపారు.

ఆస్పత్రులు, విద్యా సంస్థలకు UPI చెల్లింపుల పరిమితిని ఆర్‌బీఐ రూ.1 లక్ష నుండి రూ.5 లక్షలకు పెంచింది. రికరింగ్ చెల్లింపుల ఇ-మ్యాండేట్ పరిమితిని రూ.15 వేల నుంచి రూ.1 లక్షకు పెంచాలని ఆర్‌బీఐ నిర్ణయించింది.



# మహువా మొయిత్రాపై బహిష్కరణ వేటు

దిల్లీ: పార్లమెంట్‌లో ప్రశ్నలు అడిగినందుకు డబ్బులు తీసుకున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రాపై బహిష్కరణ వేటు పడింది. ఈ వ్యవహారంపై పార్లమెంట్ నైతిక విలువల కమిటీ ఇచ్చిన నివేదికను లోక్‌సభ ఆమోదించింది. "ఎంపీ మహువా అనైతికంగా, అమర్యాదకరంగా ప్రవర్తించారని కమిటీ చేసిన తీర్మానాన్ని ఈ సభ అంగీకరించింది. అందువల్ల ఆమె ఇక ఎంపీగా కొనసాగడం తగదు" అని స్పీకర్ ఓం బిర్లా వెల్లడించారు. ఆమె లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ.. ఆమెను సభ నుంచి బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. ఆమెపై వచ్చిన ఆరోపణలపై ఎథిక్స్ కమిటీ ఇచ్చిన నివేదికను శుక్రవారం మధ్యాహ్నం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. అనంతరం ఆమెను బహిష్కరించాలని డిమాండ్ చేస్తూ పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషీ తీర్మానాన్ని పెట్టారు. అయితే, ఈ తీర్మానాన్ని విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఎథిక్స్ కమిటీ ఇచ్చిన నివేదికపై అధ్యయనం చేసేందుకు తమకు కొంత సమయమివ్వాలని, నివేదికపై ఓటింగ్‌కు ముందు సభలో చర్చ జరపాలని టీఎంసీ సహా పలువురు విపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు.

**మహువాకు అనుమతి నిరాకరణ..** ఈ క్రమంలోనే నివేదికపై కొంతసేపు చర్చించేందుకు స్పీకర్ ఓం బిర్లా అనుమతినిచ్చారు. ఈ క్రమంలోనే అధికార, విపక్షాల మధ్య వాడీవేడీ చర్చ జరిగింది. అయితే, ఈ చర్చలో తనకు మాట్లాడే అవకాశం ఇవ్వాలని మహువా కోరగా.. సభాపతి అందుకు నిరాకరించారు. అనంతరం మూజువాణీ ఓటింగ్ ద్వారా.. ఈ నివేదికను లోక్‌సభ ఆమోదించింది. అనంతరం మహువాను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించిన స్పీకర్.. సభను వచ్చే సోమవారానికి (డిసెంబరు 11) వాయిదా వేశారు. ప్రభుత్వం తీరును నిరసిస్తూ.. ఓటింగ్ సమయంలో విపక్షాలు వాకౌట్ చేశాయి.

**మా ఇంటికి సీబీఐ వస్తుందేమో: మహువా –** తన బహిష్కరణను మహువా తీవ్రంగా వ్యతిరేకించారు. "ఎథిక్స్ కమిటీ ప్రతి నిబంధనను ఉల్లంఘించింది. మమ్మల్ని అణగదొక్కేందుకు ఈ కమిటీని ఓ ఆయుధంగా ఉపయోగిస్తున్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా కేవలం ఇద్దరు వ్యక్తులు చెప్పిన మాటలను నమ్మి నన్ను దోషిగా నిర్ధారించారు. ఇక, రేపు మా ఇంటికి సీబీఐని పంపించి నన్ను వేధిస్తారేమో" అని మహువా మండిపడ్డారు. లోక్‌సభలో ప్రశ్నలు అడిగేందుకు పారిశ్రామికవేత్త హీరానందాని నుంచి మొయిత్రా డబ్బులు, ఖరీదైన కానుకలు తీసుకున్నారని, ఆమె పార్లమెంట్ లాగిన్ వివరాలను దుబాయ్ నుంచి యాక్సెస్ చేశారని ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. దీనిపై దర్యాప్తు చేపట్టిన ఎథిక్స్ కమిటీ.. మహువా మొయిత్రాతో పాటు ఆమెపై ఫిర్యాదు చేసిన భాజపా ఎంపీ నిషికాంత్ దుబే, న్యాయవాది జై అనంత్ దెహద్రాయ్ (మహువా మాజీ మిత్రుడు)ను కమిటీ విచారించింది. అనంతరం 500 పేజీలతో కూడిన నివేదికను రూపొందించింది. మహువా అనైతిక ప్రవర్తన, సభా ధిక్కరణకు పాల్పడ్డారని ఎథిక్స్ కమిటీ పేర్కొంది. నిబంధనలకు విరుద్ధంగా తన పార్లమెంట్ లాగిన్ వివరాలను బయటి వ్యక్తులకు ఇచ్చినట్లు కమిటీ నిర్ధారించింది.

# నా అత్తారింటికి దారి చిట్టివలస.. మరి నీదేంటో చెప్పు పవన్?

విశాఖపట్నం: విశాఖలో సభ ప్రభుత్వం మీద విమర్శలకే పెట్టారని జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై మంత్రి గుడివాడ అమర్నాథ్ విరుచుకుపడ్డారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ... తెలంగాణలో జనసేనకు వచ్చిన ఫలితాలు ఆంధ్రాలో కూడా రాబోతున్నాయన్నారు. కేవలం జగన్మోహన్ రెడ్డి విమర్శిస్తే సరిపోతుందని.. జగన్నే టార్గెట్ చేస్తూ మాట్లాడిన వ్యాఖ్యలను, వైఎస్సార్పీ తీవ్రంగా ఖండిస్తున్నామని మంత్రి అన్నారు. "మీ స్థిర నివాసం హైదరాబాద్.. తెలంగాణలో మీ బలం చూసాం.. డిపాజిట్లు కూడా రాలేదు. ఆంధ్రాకు మీకు అసలేం సంబంధం ఏంటి? మీరు గత తొమ్మిది సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్‌లో ఎన్ని రోజులు ఉన్నారు పవన్ కళ్యాణ్ చెప్పాలి. పవన్ కళ్యాణ్ మీది ఏ నియోజకవర్గం చెప్పండి. గాజువాక భీమవరం మీ సొంత నియోజకవర్గ%శీ% చెప్పండి. రాష్ట్రంలో ఏ నియోజకవర్గం మనకు తెలియదు. మీరు నాన్ రెసిడెంట్ ఆంధ్రా. నాయకుడిగా పవన్ కళ్యాణ్ ఆదరించే, నియోజకవర్గ ఏది. పవన్ కళ్యాణ్‌కు అబ్రహం లింకన్స్ స్ఫూర్తి కాదు.. నారా లింకన్ స్ఫూర్తి. తెలంగాణలో బీజేపీని నాశనం చేసావ్.. ఇక్కడ ఏం చేస్తావో చూస్తా%శీ%. పొలిటికల్ కాంట్రాక్ట్ కోసం పుట్టిన పార్టీ జనసేన. తెలంగాణలో కాంట్రాక్ట్ తీసుకుని రేపు ఆంధ్రలో కాంట్రాక్ట్. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపివేశామని కేంద్రం ఎక్కడైనా చెప్పిందా? నువ్వు ఎప్పుడైనా చెప్పావా. బీజేపీ నేతల పక్కన కూర్చుంటావు వారితో ఎప్పుడైనా చెప్పించావా. రాజధాని వచ్చినా బిల్డింగ్ నిర్మాణం చేస్తే ఎందుకు అడ్డుకుంటున్నావ్. సిద్ధాంతంలో బండ్ల గణేష్‌నైనా చూసి బుద్ధి తెచ్చుకోవాలి . ఒకే దెబ్బకు చంద్రబాబు పవన్ కళ్యాణ్ రెండు పిట్టలు పడిపోతాయి. నాదెండ్ల మనోహర్, పవన్ కళ్యాణ్ దగ్గరుండి చంద్రబాబు నాయుడిని పొగుతున్నారు. పవన్ కళ్యాణ్ పక్కన నాదెండ్ల మనోహర్ కట్టప్ప ఉన్నాడు జాగ్రత్త. విశాఖలో ఇన్ఫోసిస్ డెవలప్మెంట్ సెంటర్ కాదు. సాటిలైట్ సెంటర్ నిరూపిస్తే నా పదవికి రాజీనామా చేస్తా. అత్తారింటికి దారేది.. రాజధానికి దారేది అంటున్నాడు. అత్తారింటికి దారేది అంటే నేను చిట్టివలస అని చెప్తున్నాను.. ఆయన ఏం చెప్తాడో! చెప్పమనండి" అంటూ మంత్రి గుడివాడ అమర్నాథ్ వ్యాఖ్యలు చేశారు.

# గ్రీన్ పట్టులో అందాల దివి

తెలుగు బిగ్ బాస్ ఎంతో మంది ముద్దుగుమ్మలను ప్రేక్షకులకు పరిచయం చేసింది అనడంలో సందేహం లేదు. పెద్దగా గుర్తింపు లేని ముద్దుగుమ్మలు బిగ్ బాస్ లో అడుగు పెట్టడంతో ఒక్కసారిగా సోషల్ మీడియాలో పాపులారిటీని సొంతం చేసుకుంటూ ఉన్నారు. బిగ్ బాస్ లో కనిపించిన వారు చాలా మంది ఇప్పుడు సోషల్ మీడియాలో హీరోయిన్ రేంజ్ స్టార్ డమ్ తో అభిమానించబడుతున్నారు. బిగ్ బాస్ నుంచి వచ్చి స్టార్ సెలబ్రెటీ హోదను దక్కించుకున్న ముద్దుగుమ్మల్లో దివి ముందు ఉంటారు అనడంలో సందేహం లేదు. హీరోయిన్ ఫీచర్స్ ఫుల్ గా ఉండే దివి కి తెలుగు అమ్మాయి అనే ఒక ట్యాగ్ కారణంగా పెద్ద ఆఫర్లు రావడం లేదు. కానీ సోషల్ మీడియాలో ఆమెకు మంచి ఫాలోయింగ్ ఉంది.



తన ఫాలోవర్స్ ని, నెటిజన్లను ఎప్పటికప్పుడు అలరించేందుకు గాను ముద్దుగుమ్మ దివి తన అందాలను ప్రదర్శిస్తూనే ఉంటుంది. హద్దులు మీరకుండా దివి చేసే అందాల షో ఎప్పుడూ కూడా వైరల్ అవుతూ ఉంటుంది. చీర కట్టులో.. మోడ్రన్ డ్రెస్ లో ఎలాగైనా కూడా దివి అందం అదరహో అన్నట్లుగా ఉంటుందని టాక్. తాజాగా గ్రీన్ పట్టు చీర కట్టులో దివి ఫోటో షూట్ పిక్స్ వైరల్ అయ్యాయి. తాజాగా ఆ ఫోటో షూట్ కి సంబంధించిన వీడియోను ఆమె షేర్ చేసింది. ఫోటోలతో పాటు వీడియో కూడా అంతకు మించి అన్నట్లుగా ఉందంటూ, మొత్తానికి ఈ గ్రీన్ పట్టులో దివి చాలా అందంగా ఉందంటూ మరోసారి నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.

# ప్రభాస్ తో ఊచకోత కోయించు ప్లీజ్..!

యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ బాహుబలి 2 తర్వాత సాలిడ్ హిట్ ను అందుకోలేదు. ఫ్యాన్స్ ఎప్పుడెప్పుడు ప్రభాస్ హిట్ కొడతాడా అంటూ ఎదురు చూస్తున్నారు. ఈ నెలలో క్రిస్మస్ సందర్భంగా రాబోతున్న సలార్ సినిమా తో కచ్చితంగా ప్రభాస్ ఆ విజయాన్ని దక్కించుకునే అవకాశాలు ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. సలార్ లో ప్రభాస్ యాక్షన్ సన్నివేశాలు దుమ్ములేపే విధంగా ఉంటాయి అంటూ ఇప్పటికే విడుదల అయిన ట్రైలర్ ని చూస్తే అర్థం అవుతోంది. ప్రభాస్ కి అలాంటి పాత్రలు, కథలు అయితేనే బాగుంటుందని అభిమానులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సలార్ తర్వాత ప్రభాస్ సినిమా సందీప్ వంగ దర్శకత్వంలో అనే విషయం



తెల్సిందే. వీరిద్దరి కాంబోలో ఒక పవర్ ఫుల్ కాప్ స్టోరీతో స్పిరిట్ అనే సినిమా రూపొందబోతుంది. ఆ సినిమా లో ప్రభాస్ ఎలా ఉంటాడా అంటూ అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ సమయంలో సందీప్ వంగ కి ప్రభాస్ ఫ్యాన్స్ సోషల్ మీడియా ద్వారా రిక్వెస్ట్ చేస్తున్నారు. యానిమల్ సినిమాలో ఎలా అయితే రణబీర్ కపూర్ ను చాలా అగ్రెసివ్ గా చూపించారో అలాగే స్పిరిట్ లో కూడా హీరో ను చూపించండి.. అంతకు మించి ప్రభాస్ తో ఊచకోత కోయించండి అంటూ విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభాస్ బాడీ లాంగ్వేజ్ కి, ఆయన ఫిజిక్ కి యాక్షన్ సన్నివేశాలు అద్భుతంగా ఉంటాయి. అందుకే ప్రభాస్ తో అంతకు మించి అన్నట్లుగా సలార్ లో యాక్షన్ చేయించారు. కనుక స్పిరిట్ లో కూడా ప్రభాస్ ను ఉపయోగించుకోవాలని సందీప్ వంగ కి ఫ్యాన్స్ ముందు నుంచే సూచిస్తున్నారు. మరి సందీప్ వంగ ఏం చేస్తాడో చూడాలి.




# షేక్ చేస్తాడనుకుంటే ఇలా కూల్ చేసేసాడేంటి!



పఠాన్..జవాన్ విజయాలతో షారుక్ ఖాన్ ఇండియాని షేక్ చేసిన సంగతి తెలిసిందే. వరుసగా రెండు భారీ విజయాలు షారుక్ ని మళ్లీ రేసులోకి వచ్చాయి. దీంతో డంకీతోనూ మరోసారి ఇండియాని షేక్ చేయడం ఖాయమనుకుంటున్నారంతా. డంకీతోనూ హిట్ అందుకుని హ్యాట్రిక్ హీరోగా బాక్సాఫీస్ వద్ద మరోసారి సత్తా చాటుతాడని అంతా కాన్ఫిడెంట్ గా ఉన్నారు. రాజ్ కుమార్ హిరాణీ దర్శకుడు కావడంతో కంటెంట్ పైనా అంతే నమ్మకంగా ఉన్నారు. కానీ తాజా సన్నివేశం చూస్తుంటే డంకీ కేవలం బాలీవుడ్ కే పరిమితమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాని పాన్ ఇండియాలో రిలీజ్ చేస్తున్నట్లు కనిపించలేదు. ఇప్పటివరకూ రిలీజ్ అయిన ప్రచార చిత్రాలన్ని కేవలం హిందీ వరకే పరిమితయ్యాయి. మరే భాషలోనూ వాటిని డబ్ చేయలేదు. సినిమాని అనువదిస్తున్నట్లు కూడా ఎక్కడా కథనాలు రాలేదు. దీంతో ఈ సినిమా రిలీజ్ కేవలం హిందీలోనే అని తెలుస్తోంది. రిలీజ్ కి సమయం కూడా దగ్గరపడుతుంది. ఇంకా 15 రోజులే సమయం ఉంది. ఈ గ్యాప్ అనేది డబ్బింగ్ కి సరిపోయే సమయం కూడా కాదు. కాబట్టి డంకీ ఉత్తరాదికే పరిమితమని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కొన్ని ఆసక్తికర అంశాలు తెరపైకి వస్తున్నాయి. ఇది కేవలం హిందీ రీజియన్ రాష్ట్రాలకు మాత్రమే కంటెంట్ కనెక్ట్ అవుతుందని..ఇతర భాషలకు కనెక్ట్ అవ్వడం కష్టంమని అందుకనే డబ్ చేయలేదు అన్న ప్రచారం తెరపైకి వస్తోంది. ఇంతవరకూ హిరాణీ చిత్రాలేవి కూడా అనువదించింది లేదు. గతంలో హిరాణీ తెరకెక్కించిన త్రీ ఇడియట్స్ ని రీమేక్ చేసారు తప్ప అనువదించలేదు. అలాగే పీకే చిత్రాన్ని రీమేక్ చేస్తున్నట్లు ప్రచారం సాగింది గానీ అలా చేసింది లేదు. షారుక్ ఖాన్ అన్ని రకాల ఇమేజ్ ఉన్న హీరో. అందులోనూ కామెడీ లోనూ ఖాన్ భాయ్ స్పెషలిస్ట్ . డంకీ ఆ తరహా చిత్రంలా అనిపిస్తుంది.

కానీ పాన్ ఇండియాకి కనెక్ట్ చేయకుండా వదిలేస్తున్నారు? అంటే కేవలం ఒక సెక్షన్ ఆడియన్స్ నే హిరాణీ టార్గెట్ చేసినట్లు కనిపిస్తుంది. ఇది సలార్ కి కలిసొచ్చే అంశమే. డంకీతో పాటు సలార్ కూడా అదే రోజు రిలీజ్ అవుతున్న సంగతి తెలిసిందే.

# స్టన్నింగ్ క్వీన్ ఊర్వశికి బాలయ్య ఆఫర్




బాలీవుడ్ టు టాలీవుడ్ ఊర్వశి రౌతేలా జర్నీ గురించి తెలిసిందే. ఈ బ్యూటీ పాపులర్ హీరోల సినిమాల్లో ఐటమ్ నంబర్లలో నర్తిస్తోంది. ఇటీవల వరల్డ్ కప్ 2023 మ్యాచ్ ల సమయంలో క్రికెట్ స్టేడియంలో అభిమానులను ఉల్లాసపరిచిన ఊర్వశి పలు వివాదాలతోను హెడ్ లైన్స్ లో నిలిచింది. తన స్మార్ట్ ఫోన్ ని పోగొట్టుకుని దానిని తిరిగి పొందేందుకు చాలా ప్రయత్నాలు చేసింది. ఇక ఊర్వశి ఇటీవల తిరిగి కెరీర్ పై దృష్టి సారించింది. ఇప్పటికే నాలుగు తెలుగు చిత్రాల్లో ఐటెం పాటల్లో నర్తించింది ఊర్వశి రౌతేలా. మెగాస్టార్ చిరంజీవి నటించిన వాల్తేరు వీరయ్యలో బాస్ పార్టీ సాంగ్ చార్ట్ బస్టర్ గా నిలిచింది. లెజెండరీ డ్యాన్సింగ్ స్టార్ చిరుతో తన డ్యాన్స్ మూవ్‌లను ప్రదర్శించే అరుదైన అవకాశం అందుకుంది ఊర్వశి. ఈ అవకాశం వచ్చినందుకు మెగాస్టార్ - బాబి సహా మెగాభిమానులకు చాలా కృతజ్ఞతలు తెలిపింది.

అంతకుముందు గోపిచంద్ సహా పలువురి సినిమాల్లో ప్రత్యేక గీతాల్లో నర్తించింది ఈ బ్యూటీ. అయితే ఇప్పుడు బాస్ పార్టీ..లో అవకాశం కల్పించిన బాబి మరోసారి ఊర్వశికి అవకాశం కల్పించారని తెలిసింది. నటసింహా నందమూరి బాలకృష్ణతో బాబి ఓ భారీ యాక్షన్ ఎంటర్ టైనర్ తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా చిత్రీకరణ ఇటీవల ఊటీలో జరుగుతోంది. ఇందులో ఊర్వశి కేవలం ఐటమ్ నంబర్ వరకేనా లేక ఏవైనా సీన్లలో నటిస్తుందా? అన్నది తెలియాల్సి ఉంది. ప్రధాన తారాగణం, సాంకేతిక నిపుణుల వివరాల్ని కూడా టీమ్ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

**పారిస్ ఫ్యాషన్ వీక్ లో మెరుపులు:** ఊర్వశి రౌతేలా ఇటీవల ప్యారిస్ ఫ్యాషన్ వీక్‌లో తన హాట్‌నెస్‌తో అందరి దృష్టిని ఆకర్షించింది. ఊర్వశి తన బోల్డ్ వార్డ్‌రోబ్ ఎంపికలలో హెడ్ టర్నర్ గా మారింది. ఊర్వశి కిల్లర్ లుక్.. అద్భుతమైన ఎలివేషన్ కి ప్యారిస్ ఫ్యాషన్ వరల్డ్ తలొంచింది. బ్లాక్ బికినీలో ఊర్వశి రౌతేలా అద్భుతమైన లుక్ మతులు చెడగొట్టింది. ఈ ఈవెంట్‌లో ఊర్వశి రౌతేలా బికినీలో బోల్డ్ లుక్‌లో కనిపించింది. నెట్టెడ్ పొడవాటి దుస్తులు స్క్వేర్ లుక్ బ్రాలెట్‌ను ధరించి స్ట్రైకింగ్ ఫోజులతో కట్టిపడేసింది. ఊర్వశి బరువైన ఉలెన్ ష్రగ్ ని ధరించి మరింత మంత్రముగ్ధులను చేసింది. ఊర్వశి తన స్టైలింగ్‌తో లుక్ తో ఆకట్టుకుంది. ఊర్వశి రౌతేలా తన ఇన్‌స్టాగ్రామ్‌లో 69.8 మిలియన్ల వీక్షణలతో విపరీతమైన ఫాలోయింగ్ ని ఆస్వాధిస్తోంద. తన రెగ్యులర్ పోస్ట్‌లు, అప్‌డేట్‌లతో అభిమానులను ఎంగేజ్ చేస్తోంది.

# ట్రెడిషనల్ ఔట్ ఫిట్ లో వామికా అందం...!

పంజాబీ, హిందీ, మలయాళం, తెలుగు, తమిళం ఇలా అనేక భాషల్లో నటించి మెప్పించిన వామికా గబ్బి సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడు సెన్సేషనల్ స్టార్ గానే తన అందాల ఫోటో షూట్ తో నిలుస్తూ ఉంది. తాజాగా మరోసారి ఒక ప్రముఖ మేగజైన్ కోసం ట్రెడిషనల్ లుక్ లో ఇలా అందంగా కనిపించి వైరల్ అయ్యింది. మత్తు ఎక్కించే కళ్లతో వామికా గబ్బి నెటిజన్స్ ను కవ్విస్తోంది. అంతే కాకుండా తన అందం తో చూపు తిప్పుకోకుండా చేస్తుంది. ఆకట్టుకునే ఔట్ ఫిట్ తో పాటు అందుకు మ్యాచ్ అయ్యే హెవీ జ్యువెలరీ ని కూడా వామికా ధరించి అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ లుక్ లో




కూడా వామికా భలే ఉందే అంటూ చాలా మంది కామెంట్స్ చేస్తున్నారు. తు మేరా 22 మెయిన్ తేరా 22 చిత్రంతో గుర్తింపు దక్కించుకుని నటిగా బిజీ అయిన వామికా ఉత్తరాదిన హిందీలో మాత్రమే కాకుండా పంజాబీ భాషల్లో చాలా సినిమాలు చేసింది. అదే సమయంలో సౌత్ నుంచి వచ్చిన ఆఫర్లను అంది పుచ్చుకుని వరుసగా ఇక్కడ కూడా సినిమాలు చేసింది. తెలుగు లో ఈ అమ్మడు భలే మంచి రోజు సినిమాలో నటించింది. అయితే ఆ సినిమా కమర్షియల్ గా విజయాన్ని సొంతం చేసుకోలేక పోవడంతో ఈ అమ్మడికి మళ్లీ టాలీవుడ్ నుంచి ఆఫర్ రాలేదు. అయితే ఇతర భాషల్లో మాత్రం ఈమె కొనసాగుతోంది. అందాలను చూస్తూ ఉంటే మళ్లీ టాలీవుడ్ లో ఈమెను చూడాలని చాలా మంది కోరుకుంటున్నారు.

# 2024 లోనైనా మొదలవుతుందా దీపిక?

బాలీవుడ్ లో దీపికా పదుకొణే స్టార్ డమ్ గురించి చెప్పాల్సిన పనిలేదు. అగ్ర హీరోయిన్ గా పరిశ్రమలో కొనసాగుతుంది. హీరోల సరసన నటిస్తూనే సోలోగానూ బాక్సాఫీస్ వద్ద సత్తా చాటిన నటి. నటిగా తనకంటూ ప్రత్యేకమైన బ్రాండ్ ఐడెంటిటీని క్రియేట్ చేసుకున్న నటి. అధిక పారితోషికం తీసుకునే హీరోయన్లలో దీపిక టాప్ లో ఉంది? అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇక బ్రాండింగ్స్ ని ఎండార్స్ చేస్తూ అక్కడా భారీగానే సంపాదిస్తుంది. ఇంత గొప్ప ట్రాక్ రికార్డు కలిగిన దీపిక తన సొంత బ్యానర్ ప్రకటించిన సినిమా ని పట్టాలెక్కించడానికి మాత్రం నానా అగచాట్లు పడుతున్నట్లే కనిపిస్తుంది. రెండేళ్ల క్రితం హాలీవుడ్ చిత్ర ది ఇంటెర్న్ ని హిందీలో రీమేక్ చేస్తున్నట్లు ప్రకటించింది. హాలీవుడ్ లో మంచి విజయం సాధించడంతో అదే టైటిల్ తో హిందీ ప్రేక్షకుల ముందుకు



తీసుకురావాలని నడుం బిగించింది. ఈ ప్రాజెక్ట్ కి ఎవరైతే న్యాయం చేస్తారని భావించి చాలా మంది దర్శకుల్ని పరిశీలించి చివరిగా అమిత్ శర్మని ఫైనల్ చేసింది. హిందీ ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టు కథను మార్చడం జరిగింది. కానీ ఇంతవరకూ ఈ సినిమాని ప్రారం భించింది లేదు. అందుకు గల కారణాలు ఏంటి ? అన్నది తెలియదు గానీ ప్రకటించిన తర్వాత దీపిక పదుకొణే ఒక్కసారిగా సైలెంట్ అయిపోయింది. ఆ తర్వాత అందులో నటించే నటీనటులు ఎవరు? టెక్నికల్ టీమ్ ఏంటి? అన్నది ఏదీ పట్టించుకోలేదు. రెండేళ్లు గడవడంతో మీడియా సైతం ఈ విషయాన్ని మర్చిపోయింది. దీనిపై ఎలాంటి టాపిక్ కూడా బాలీవుడ్ సహా మీడియాలోనూ చర్చకు రాలేదు. ఈ నేపథ్యంలో తాజాగా ఈ చిత్రాన్ని 2024 జనవరిలో ప్రారంభించే అవకాశాలున్నట్లు ఓ వార్త బయటకు వచ్చింది. ఇందులో నిజం ఎంత అన్నది తెలియదు గానీ జాతీయ మీడియాలో ఈ వార్త బయటకు రావడం ఆసక్తికరంగా మారింది. మరి ఇప్పటికైనా దీపికా ది ఇంటెర్న్ గురించి ఏ వివరాలైనా చెబుతుందా? ఎప్పటిలాగే మౌనం వహిస్తుందా? అన్నది చూడాలి. 2024 లో మొదలైతే మోక్షం కలిగినట్లే.




# మాజీ సీఎం కేసీఆర్‌కు గాయం.. యశోద ఆస్పత్రిలో చికిత్స

హైదరాబాద్: భారాస అధినేత, తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ ఆస్పత్రిలో చేరారు.

కాలుజారి పడటంతో ఆయనకు గాయమైంది. దీంతో గురువారం అర్ధరాత్రి సోమాజిగూడ యశోద ఆస్పత్రిలో కేసీఆర్‌ను చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఆయనకు తుంటి ఎముక విరిగినట్లు వైద్యులు గుర్తించారు. శస్త్రచికిత్స నిర్వహించాల్సి రావొచ్చని భావిస్తున్నారు. అయితే వైద్య పరీక్షలు పూర్తయ్యాక శస్త్రచికిత్సపై వైద్యులు నిర్ణయం తీసుకోనున్నారు.

**కేసీఆర్ త్వరగా కోలుకోవాలి: ప్రధాని మోదీ** – కేసీఆర్‌కు గాయం కావడంపై ప్రధాని నరేంద్ర మోదీ విచారం వ్యక్తం చేశారు. ఆయన పూర్తి ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు ప్రధాని ట్వీట్ చేశారు.




# కేసీఆర్ ఆరోగ్యంపై సీఎం రేవంత్ రెడ్డి ఆరా

హైదరాబాద్: మాజీ సీఎం కేసీఆర్‌కు శుక్రవారం సాయంత్రం 4 గంటలకు యశోద ఆస్పత్రి వైద్యులు ఆపరేషన్ చేశారు. గురువారం రాత్రి ఫామ్ హౌస్‌లో కాలుజారి పడిపోవడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. దీంతో కుటుంబసభ్యులు హుటాహుటిన యశోద ఆస్పత్రికి తరలించారు. కేసీఆర్ కోసం గ్రీన్ చానల్ ఏర్పాటు చేసిన పోలీసులు ట్రాఫిక్ క్లియరెన్స్ చేశారు. కేసీఆర్‌కు తొంటి ఎముక రెండు చోట్ల విరిగినట్లు వైద్యులు తెలిపారు. ఆయనకు ఆపరేష్ చేయాల్సి ఉంటుందని ఇప్పటికే వైద్యులు వెల్లడించారు. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై సీఎం రేవంత్ రెడ్డి ఆరా తీశారు. ఆయనకు మెరుగైన వైద్యం అందించాలని ఆరోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీకి సూచించారు. ముఖ్యమంత్రి ఆదేశాలమేరకు ఆరోగ్యశాఖ కార్యదర్శి యశోద ఆస్పత్రికి వెళ్లారు. వైద్యులతో మాట్లాడి కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు.

**హెల్త్ బులెటిన్ విడుదల..** కేసీఆర్ హెల్త్ బులెటిన్‌ను యశోద ఆస్పత్రి వైద్యులు విడుదల చేశారు. కోలుకునేందుకు 6 నుంచి 8 వారాలు పడుతుందన్నారు. ప్రస్తుతం కేసీఆర్ వైద్యుల పరిరక్షణలో ఉన్నట్లు తెలిపారు.


కాగా గురువారం రాత్రి ఫామ్ హౌస్ బాత్ రూమ్‌లో జారి పడ్డారు. దీంతో ఆయన తొంటికి తీవ్ర గాయమైంది. కుటుంబసభ్యులు ఆయనను యశోద ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టరు.. తుంటి ఎముక రెండు చోట్ల విరిగినట్లు గుర్తించారు. ఈ రోజు ఆయనకు శస్త్ర చికిత్స చేయనున్నారు. తుంటి ఎముకకు స్టీల్ ప్లేట్స్ వేసే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. తుంటి బాల్ కూడా డ్యామేజ్ అయినట్లు వైద్య బృందం గుర్తించింది. కాగా హాస్పిటల్‌లో కేసీఆర్ వెంట కవిత, కేటీఆర్, హరీష్ రావు ఉన్నారు.

# కేసీఆర్‌కు గాయమైందని తెలిసి బాధపడ్డా: పవన్‌కల్యాణ్



అమరావతి: భారాస అధినేత, తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్‌కు గాయమైందని తెలిసి బాధపడ్డానని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. "కేసీఆర్ సంపూర్ణంగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. ఎన్నో సవాళ్లను అధిగమించిన ఆయన.. ఈ అనారోగ్య పరిస్థితులనూ మనోధైర్యంతో అధిగమిస్తారనే నమ్మకం నాకుంది. పూర్తి ఆరోగ్యంతో మళ్లీ ప్రజలకు, సమాజానికి తన సేవలు కొనసాగిస్తారని ఆకాంక్షిస్తున్నాను" అని పవన్ పేర్కొన్నారు.

# 28 రోజుల్లో.. రూ.2.38 కోట్ల హుండీ ఆదాయం



యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఖజానా కు 28రోజుల్లో రూ.2.38కోట్ల హుండీ ఆదాయం లభించింది. గత నెల 9నుంచి ఈ నెల 6వ తేదీవరకు నృసింహుడిని దర్శించుకున్న భక్తులు హుండీల్లో సమర్పించిన మొక్కు కానుకలను సిబ్బంది గురువారం లెక్కించారు. 28 రోజుల్లో రూ.2,38,46, 282 నగదు, 90గ్రాముల ముడి బంగారం, 3.740 కిలోల మిశ్రమ వెండి భక్తులు సమర్పించగా ఆలయ ఖజానాకు జమ చేశారు. విదేశీ కరెన్సీ రూపంలో 748 అమెరికా డాలర్లు, 670యూఏఈ దిర్హామ్స్, 40ఆస్ట్రేలియా డాలర్లు, 150కెనడా డాలర్లు, 80 సింగపూర్ డాలర్స్, 100 ఇంగ్లండ్ పౌండ్స్, 21 సౌదీఅరేబియా రియాల్స్, 200 శ్రీలంక రూపీలు, 25 యూరప్ యూరోలు, 50 కెన్యా షిల్లింగ్స్, 200 ఒమన్ రియాల్స్, 1012 మలేషియా రింగెట్స్, ఒకటి కతార్‌రియాల్, 10 నేపాల్ రూపీలు, 2ఉక్రెయిన్ హ్రైనియాలు,240 థాయిలాండ్ భట్‌లు సమకూరాయి. కొండకింద సత్యనారాయణస్వామి వ్రతమండపంలో నిర్వహించిన కానుకల లెక్కింపును ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, ఈవో గీతారెడ్డి పర్యవేక్షించారు.

**నృసింహుడికి శాస్త్రోక్తంగా నిత్యారాధనలు :** యాదగిరీశుడికి గురువారం నిత్యారాధనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్యతిరుకల్యాణో త్సవం ఆగమ శాస్త్రరీతిలో నిర్వహించారు. శివాలయంలో రామలింగేశ్వరుడికి నిత్యారాధనలు, కొండకింద వ్రతమండంలో సత్యనారాయణస్వామి వ్రతపూజలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి. కార్తీక మాసం సందర్భంగా మహిళా భక్తులు హరిహరుల ఆలయాల ఆవరణలో దీపారాధనలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.20,77,049 ఆదాయం సమకూరినట్టు దేవస్థాన అధికారులు తెలిపారు.

# కేటీఆర్, కవితకు కౌంట్ డౌన్ స్టార్ట్..: సుఖేష్ చంద్రశేఖర్ లేఖ



ఢిల్లీ: రూ.200 కోట్ల మనీలాండరింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న సుఖేష్ చంద్రశేఖర్ మండోలి జైలు నుంచి మరో సంచలన లేఖను విడుదల చేశారు. మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవితకు కౌంట్ డౌన్ ప్రారంభమైందన్నారు. కవిత, కేటీఆర్ అవినీతి బయటపడుతుందని తెలిపారు. వీరిద్దరూ త్వరలో జైలు క్లబ్‌లో చేరుతారన్నారు. "డియర్ కేటీఆర్ బ్రదర్, కె.కవితక్క.. అసెంబ్లీ ఎన్నికల్లో మీరు సాధించిన ఫలితాలకు అభినందనలు. మీ అబద్ధాలు, అత్యాశలు, అవినీతి తెలుగు ప్రజలకు అర్థమైనట్లే మీ అహంకారం కూడా అంతమవుతుందని కొన్ని నెలల క్రితం నేను చెప్పిన విషయం గుర్తుండే ఉంటుంది. మీ గురించి తెలుసుకున్న ప్రజలు మీకు ఈ విధమైన తీర్పు ఇచ్చారు. మీరు నన్ను మోసగాడు అన్నారు. కానీ ఇవాళే మీరే మోసగాళ్లలా మిగిలిపోయారు. ఇప్పుడు మీకు, నాకు అట్టే తేడా ఏమీ లేదు. మీరు అవినీతిపరులు కాదని నిరూపించుకునేందుకు సిద్ధమవ్వండి. త్వరలోనే మీరు కూడా జైలు క్లబ్‌లో చేరుతారు. త్వరలోనే మీరంతా అమెరికాకు పయనమవుతారని భావిస్తున్నా. మీకు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. ఈ దేశంలో చట్టం, సామాన్యుడి కంటే ఎవరూ శక్తివంతులు కాదు. ఫలితాల రోజు ఎక్స్‌లో తుపాకీ పట్టుకుని 3.0 అని మీరు పెట్టిన పోస్ట్ చూశాను. మీరు చెప్పిన 3.0 జైలు జీవితం త్వరలోనే ప్రారంభమవుతుంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ అన్నకు అభినందనలు" అని సుఖేష్ లేఖలో పేర్కొన్నారు.



# ప్రొటెం స్పీకర్‌గా అక్బరుద్దీన్ ఎన్నిక

హైదరాబాద్: తెలంగాణ శాసనసభ సమావేశాల్లో తొలి సమావేశాలకు ప్రొటెం స్పీకర్‌గా ఎవరు వ్యవహరిస్తారనే చర్చకు తెరపడింది. అక్బరుద్దీన్ ఒవైసీ ప్రొటెం స్పీకర్‌గా వ్యవహరించనున్నారు. శనివారం ఉదయం 8.30గంటలకు ప్రమాణస్వీకారం చేయనున్నారు.

రాజ్‌భవన్‌లో అక్బరుద్దీన్ చేత గవర్నర్ ప్రమాణం చేయించనున్నారు. కొత్తగా ఎన్నికైన సభ్యులతో మొదటగా ప్రమాణ స్వీకారం చేయించి స్పీకర్‌ను ఎన్నుకునేంత వరకు ప్రొటెం స్పీకర్ బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుంది.

సాధారణంగా ఎక్కువసార్లు శాసనసభకు ఎన్నికైన ఎమ్మెల్యేను ప్రొటెం స్పీకర్‌గా నియమిస్తారు. **ప్రస్తుతం అసెంబ్లీలో ఏ పార్టీ వాళ్లు ఎంతమంది ఉన్నారంటే..** కాంగ్రెస్–64, బీఆర్ఎస్–39, బీజేపీ–8, ఎంఐఎం–7, ఇతరులు–1.

# నన్ను ఎవరూ పిలవలేదు : ప్రభాకర్‌రావు




హైదరాబాద్ : తెలంగాణ కొత్త సీఎం రేవంత్‌రెడ్డి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో విద్యుత్ శాఖపై సమీక్ష నిర్వహిస్తున్నారు. ఈ సమీక్షకు ఇప్పటికే రాజీనామా చేసిన ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు హాజరు కాలేదు. ఆయన రాజీనామాను ఆమోదించవద్దని, సమీక్షకు ప్రభాకర్‌రావు హాజరయ్యేలా చూడాలని గురువారం విద్యుత్ శాఖ కార్యదర్శిని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రభాకర్‌రావు సమీక్షకు గైర్హాజరవడం ప్రాధాన్యత సంతరించుకుంది. విద్యుత్ శాఖలో డిస్కంలకు ఇప్పటి వరకు రూ.85వేల కోట్ల అప్పులు ఉన్నాయని అధికారులు సీఎం రేవంత్‌రెడ్డికి వివరించారు. దీంతో అసలు శాఖలో ఏం జరుగుతోందన్న కోణంలో సీఎం అధికారులను ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో భాగంగా 200 యూనిట్లలోపు విద్యుత్ వాడే వారికి ఉచితంగా కరెంటు ఇస్తామని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ హామీ అమలు కోసమే విద్యుత్ శాఖ వ్యవహారాలపై పూర్తి అవగాహన కోసం సీఎం సమగ్ర రివ్యూ జరుపుతున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. అంతకుముందు ఉదయమే సీఎం రేవంత్‌రెడ్డి ఆర్టీసీపై సమీక్ష నిర్వహించారు. ఆర్టీసీ ఆదాయ, వ్యయాలపై సీఎం సమీక్షలో ఆరా తీశారు. రేపటి నుంచి ప్రారంభించనున్న మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం హామీపై సమీక్షలో ఆర్టీసీ అధికారులకు సీఎం పలు సూచనలు చేసినట్లు తెలిసింది. ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించి రవాణాశాఖ త్వరలో పూర్తి మార్గదర్శకాలు జారీ చేయనున్నట్లు సమాచారం. తెలంగాణలో ఆర్టీసీ బస్సుల్లో రోజుకు 12 నుంచి 13 లక్షల మంది ప్రయాణం చేస్తున్నారు. మహిళలకు ఉచిత ప్రయాణంతో ఆర్టీసీపై రోజుకు రూ.4 కోట్ల దాకా భారం పడనున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. విద్యుత్ శాఖపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష వ్యవహారంపై తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు స్పందించారు. సీఎం సమీక్ష గురించి తనకు సమాచారం లేదని, తనను సమీక్షకు ఎవరూ పిలవలేదని ప్రభాకర్‌రావు మీడియాకు చెప్పడం గమనార్హం. ముఖ్యమంత్రి పిలిస్తే సమీక్షకు ఎందుకు వెళ్లనని ఆయన ప్రశ్నించారు.

# కేసీఆర్‌ను పరామర్శించిన ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కాలుజారి పడటంతో ఆయనకు గాయమైన విషయం తెలిసిందే. దీంతో గురువారం అర్ధరాత్రి సోమాజిగూడలోని యశోద దవాఖానకు తరలించారు. పరిశీలించిన వైద్యులు ఎడమ కాలి తుంటి ఎముక విరిగిందని నిర్ధారించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. తుంటి ఎముక మార్పిడి చేయాలని, కోలుకోవడానికి 6 నుంచి 8 వారాలు పడుతుందని చెప్పారు. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని వెల్లడించారు. కాగా, దవాఖానలో చికిత్స పొందుతున్న కేసీఆర్‌ను ఎమ్మెల్సీ కవిత పరామర్శించారు. దురదృష్టవశాత్తు జరిగిన ప్రమాదం వల్ల పెద్ద శస్త్ర చికిత్స జరుగనుంది. ఆయన త్వరగా కోలుకోవాలని బీఆర్ఎస్ కుటుంబ సభ్యులతోపాటు తాము కూడా ప్రార్థిస్తున్నామని చెప్పారు. ఈమేరకు ఎమ్మెల్సీ కవిత ట్వీట్ చేశారు.

# కేసీఆర్ త్వరగా కోలుకోవాలి : కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ట్వీట్



హైదరాబాద్ : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దవాఖానలో చేరిన విషయం తెలిసిందే. గురువారం అర్ధరాత్రి ఆయన కాలు జారి కిందపడటంతో తీవ్ర గాయమైంది. వెంటనే ఆయనను సోమాజిగూడ యశోదా హాస్పిటల్‌కు తరలించారు. ప్రస్తుతం కేసీఆర్ వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. ఈ నేపథ్యంలో కేసీఆర్ ఆరోగ్యంపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. కేసీఆర్‌కు గాయమైన విషయం తెలియగానే చాలా బాధపడ్డట్లు ప్రముఖ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా తెలిపారు. ఆయన త్వరగా కోలుకోవాలని, మంచి ఆరోగ్యంతో ఉండాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. కాగా, కేసీఆర్‌ను పరిశీలించిన వైద్యులు తుంటి ఎముక విరిగినట్లు గుర్తించారు. దీంతో ఐసీయూకి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం కేసీఆర్‌కు హిప్ రీప్లేస్‌మెంట్ సర్జరీ చేయనున్నారు. కేసీఆర్ ఆరోగ్యంపై ఎమ్మెల్సీ కవిత సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించారు. కేసీఆర్‌కు స్వల్ప గాయమైందని, ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని చెప్పారు. ఆయన త్వరలోనే కోలుకుంటారని వెల్లడించారు. కేసీఆర్‌పై ప్రజల ప్రేమాభిమానాలకు ధన్యవాదాలు తెలిపారు.

# రాష్ట్రంలో మార్పు కనిపిస్తోంది.. ప్రజాదర్బార్ బాగుంది



హైదరాబాద్: రాష్ట్రంలో మార్పు కనిపిస్తోందని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. శుక్రవారం ప్రజాభవన్‌కు వచ్చిన ఆయన.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాదర్బార్ బాగుందన్నారు. వేలాది మంది ప్రజలు వారి సమస్యలు చెప్పుకోడానికి వస్తున్నారని తెలిపారు. ఇప్పటి వరకు ఏ సీఎం చేయని పని రేవంత్ చేస్తున్నారని అభినందించారు. తాను చూడ్డానికి వచ్చానని.. చాలా సంతోషంగా ఉందన్నారు. గడీలు బద్దలు కొట్టి ప్రజలు వస్తున్నారని మోత్కుపల్లి నరసింహులు పేర్కొన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com